RNGA 115 B 125

శ్రీకృష్ణదేవరాయలు



నండూరి రామకృష్ణమాచార్య

I

శ్రీకృష్ణదేవరాయలు

చారిత్రక రూపకము



★

శ్రీ నండూరి రామకృష్ణమాచార్య

★

ప్రచురణ

కవితా ప్రభాస

భీమవరం

ప్రథమ ముద్రణము 1960

ప్రతులు 1000

ప్రతులకు :

త్రివేణి పబ్లిషర్స్
మచిలీపట్నం, కృష్ణాజిల్లా

విజ్ఞాన ప్రభాస
C/o ఉదయిని ప్రెస్సు
భీమవరము, పశ్చిమగోదావరి

అజంతా ప్రింటర్స్,
సికింద్రాబాదు

మూల్యము - రు. 2-00

మనవి

"శ్రీకృష్ణదేవరాయలు"—1953 వ సంవత్సరమున అలనాటి ఆంధ్రరాజధాని కర్నూలునుండి వెలువడిన "మనసీమ" పత్రికలో వారాను గతముగ ప్రచురితమైనది—

ఇది ఈనాటికి తిరిగి పుస్తకరూపమున పునర్ముద్రణము.

నాటకరచనలో ఇతివృత్తముగా చరిత్రను స్వీకరించుట—సరిపోవని దుప్పటిని కప్పుకొనుట వంటిది. పైనకు గుంజిన కాళ్ళు - క్రిందకు లాగిన తల బైటపడక తప్పదు. నాటకీయత కోసము చూచిన చరిత్రకు దెబ్బ తగులవచ్చు. చరిత్రకోసము చూచిన నాటకీయత కొరవడవచ్చును. అయినను ఈ అసిధారావ్రతము రచయిత బుద్ధిపూర్వకముగనే స్వీకరించుటకు దక్షిణాపథ చరిత్రలో కటకమునుండి కన్యాకుమారి వరకు విజయనగరసామ్రాజ్యము విస్తరించి, ఆంధ్రవాఙ్మయములో స్వర్ణయుగము సృష్టించిన సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల యితివృత్తము రూపకంగా రచింపవలెనను ఆబాల్య మనోరథమే ముఖ్య కారణము. రాయలు - తిమ్మరుసు; పెద్దన - ధూర్జటి; చాకలిశాయి - తెనాలి రామలింగడు; ప్రహరేశ్వరపాత్రుడు - మీనాక్షి; చిన్నాదేవి - పాత్రచిత్రణలోని వైవిధ్యముగూడ రచయితకు మరియొక ప్రలోభము గల్పించినది. కాని—ఈ రూపక రచన చిరకాలము ఒక తీరనికోరికగనే నిలిచినది.

ఇంతలో తలవని తలంపుగ—ఒకనాడు మిత్రశ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, వారి సోదరుడు తుమ్మలపల్లి సూర్యనారాయణమూర్తితో కలిసి హంపి - విజయనగర యాత్ర సలుపు అవకాశము లభించినది. ఆ కల్యాణయాత్రలో విజయనగర శిధిలశిల్పావశేషములు కల్పించిన భవ్యకవితావేశము - సమాధిబద్ధమై చివరకు ఈ రూపకరూప

ముగ వెల్లివిరిసినది, శ్రీ సూర్యనారాయణమూర్తి నాటినుండి కనుపించి నపుడెల్ల ప్రశ్నార్థకమగు నయనద్యుతులతో సంభావించుచు, ఈ రూపక మును గూర్చి చర్చించుచుండుటగూడ కద్దు, నేను తలవంచుకొనుట గూడ కదు.

నేటికైన శ్రీ తుమ్మలపల్లి సోదరుల సౌహృద ఋణము - తీర్చ రానిది - కొంతవరకైన తీరినదని నా సంతోషము.

నాటకకళకు హృదయములో వెన్నెలదేవళము కట్టుకొని ఆరా ధించు భక్తుడు మిత్రశ్రీ డాక్టరు పొన్నపల్లి సుబ్రహ్మణ్యం, D. M. & S. గారి ప్రోత్సాహమే లేనిచో ఈ రూపకము ప్రొద్దు పొడుపు చూచి యుండదు.

రాయి విసరిన మానవుడు రాకెట్టు వేయగలిగినా, మానవుడు మానవుడేగాని మారలేదని, స్వర్ణయుగము అనే కీర్షిక చరిత్ర కల్పించిన దుర్భిమ అనెడి తాత్త్వికులు లేకపోలేదు. ఏ నాటకము అయినా యీ జగన్నాటకములో ఒక అంతర్నాటకమే. ఈ సత్యమును సాక్షాత్కరింప చేసి క్షణమాత్రమైన సహృదయులను జీవన్ముక్తులను చేయగలిగినచో రచయిత ధన్యుడు.

—నండూరి రామకృష్ణమాచార్య.

భూమికలు

శ్రీకృష్ణదేవరాయలు

తిమ్మరుసు

పెద్దన

ధూర్జటి

తెనాలి రామకృష్ణుడు

చాకలిశాయి

ప్రహరేశ్వరపాత్రుడు

తిరుపతి మల్లు

రంగశాయి

చిన్నాదేవి .

మీనాక్షి .

వందిమాగధులు : భటులు

VI

కృతిసమర్పణము

మిత్రశ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తిగారికి

శ్రీ వాణీ మృదు సామరస్య సమతా సంపూర్ణ గేహాంగణః
కస్తూరీ ఘనసార సార కవితా సౌరభ్య సమ్మీరణః
గాంధీ తత్త్వ పవిత్ర భావమహితో గ్రామీణ సేవాచణః
శ్రేయోరాజ్య ధురంధరో విజయతాం శ్రీ సత్యనారాయణః.

శ్రీ తుమ్మలపల్లి విభా
సిత వంశజునకు దేశ సేవామతికిన్
హితునకు కవితారతునకు
సతత సరసతా సహృదయ సమ్రూట్టునకున్.

దేశభాషలయందు తెలుగు లెస్సనుమాట
పాటగా కచ్చపి మీటె నెవడు
భువనవిజయ సభాభవనాన అష్టది
గ్గజ కవులను గొల్చి కాచె నెవడు
గండపెండేరమ్ము కవిపాచమును బట్టి
యెడద పులకరింప తొడిగె నెవడు
మదకరీంద్రము నాపి యెదురైన కవులకు
కేలూతయొసగి యెక్కించె నెవడు

అట్టి శ్రీకృష్ణరాయలు ఆర్ద్రి సరసే
సహృదయత్వమ్మ చర్వితచర్వణముగ
కొంత కన్పింప నీ కనుగొల్కులందు
కృతి యొసంగితి నీకు సుహృద్వరేణ్య

కైతకు కోరి నీ యెడద కట్టితి వెన్నెల దేవళమ్ము ; వి
ఖ్యాతిని గాంచినావు కవిగా యువ కాంగ్రెసుకార్యజాత సం
ధాతవుగా స్వతంత్ర భరతస్థలి ఉత్తమమైన గ్రామ ని
ర్మాతవుగా ప్రపంచమున మంచి మనస్సును మించడేదియున్.

•

కన్నె మనస్సులో వలపుకన్నను ఆమనిరేల పూలపై
వెన్నెలకన్న క్రొన్ననల విచ్చు సుగంధముకన్న మేటి సం
పన్నతకన్న బాంధవపు బంధముకన్న పవిత్ర మైత్రియే
మిన్న ; గ్రహింపు మీ కృతిని, మిత్రజనైక శిరోవిభూషణా !

— నండూరి రామకృష్ణమాచార్య

శ్రీకృష్ణదేవరాయలు

ప్రథమరంగము

[స్థలం : విజయనగరం శ్రీకృష్ణదేవరాయల భవనం.]

(చిన్నాదేవి ఆనందంతో పాడుతూ శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాల వేస్తూ నృత్యం చేస్తుంది.)

చిన్నాదేవి: "పున్నమ వెన్నెల పూచెనురా
కడలియు గగనము కలిసెనురా
పువ్వువు నీవై పుప్పొడి నేనై
కవితవు నీవై గానము నేనై
మెదడువు నీవై హృదయము నేనై
రాయలు నీవై రాణిని నేనై
వీరముతో శృంగారము
విశ్వజనీనముగా వెలయించెదమా—"

చాకలి: (ప్రవేశించి - గద్గదస్వరంతో) అమ్మా! అమ్మా!

చిన్నాదేవి: ఏరా చాకలీ! ~~తొందరగా చెప్పు~~. ఎప్పుడూ నీ మొగంమీద తుమ్మలలో ప్రొద్దు గ్రుంకటమే కనిపిస్తుందేమిటిరా? నరసింగ రాయలవారు కొండెక్కారా?

చాకలి: నరసింగరాయలవా రప్పుడే అంత సులువుగా పోతారా? ఎంత మందిని సూడాలో! రాసపీనుగుకు ముందు ఎన్ని పీనుగులు ఎల్లాలో—!

చిన్నాదేవి: అదేమిటిరా, మొన్ననే నిముషాలమీద ఉన్నారని తిమ్మరు సయ్యగారు అన్నారన్నావు గదరా! పోనీ! ఇంకెంత కాలం

ఊరేగుతాడు, శ్రీకృష్ణరాయలవారు సింహాసనం ఎక్కగానే, కాయీ, కోరుకో నీకేంకావాలో ; అప్పుడు నేను దేవేరిని, మహారాణిని తెలిసిందా ; అనవసరంగా దిగాలుపడి తిరక్కు. మంచిరోజులు వస్తున్నాయి. మనకేకాదు, విద్యానగర సామ్రాజ్యానికి, దక్షిణాపథ చరిత్రకే...

చాకలి : అమ్మా ; అలాగే అనుకున్నాం అంతా - తా నొకటి తలుస్తే దైవం ఇంకోటి....

చిన్నాదేవి : అదేమిటిరా చాకలీ ?

చాకలి : మహారాజులుంగారు మరణశయ్యమీద...

చిన్నాదేవి : ఊఁ. మరణశయ్యమీద...

చాకలి : కిట్టరాయలోరిని పట్టుకురమ్మని తిమ్మరుసయ్యకు ఆగ్గె పీకారుట. కాని - కిట్టరాయలవోరు ఎక్కడా కనుపించలేదుట.

చిన్నాదేవి : అయితే ; మహారాజుకు ఏమీ దుర్బుద్ధి పుట్టలేదుగదా. ముక్కుపచ్చలారని పసిబిడ్డకు - పట్టుమని పదేళ్ళు లేని యువ రాజుకు సామ్రాజ్యం అంతా కట్టిపెట్టాలనేగా - తరువాత ఏమైందీ?

చాకలి : ఏమైంది తల్లీ - నాకు నోరెట్లా వస్తుంది - చెప్పటానికి. ఏం సెప్పను తల్లీ.

చిన్నాదేవి : తొందరగా చెప్పరా ; కాయీ ; ఏం మాట్లాడవేం ; నీ వెట్టి చూపులు వెయ్యి బాకుల్లాగ గ్రుచ్చుకొంటున్నాయి ; శ్రీకృష్ణ దేవరాయల జాడ లేమైనా తెలిసాయా ?

చాకలి : ఎందుకు తెలియవు తల్లీ తిమ్మరుసయ్య తలుసుకుంటే ;—

చిన్నాదేవి : అయ్యో- తిమ్మరుసుకే దుర్బుద్ధి పుట్టిందా ? అయినా కృష్ణ రాయలు దొరకటం అసంభవం. దొరికినా గురుదేవుడు శిష్యుని మీద, చివరకు వాత్సల్యం చూపించక తప్పదు.

చాకలి : అదేవిటి తల్లీ ; పిచ్చి మాట - తిమ్మరుసయ్య నన్ను సూసి గుడ్లు ఎర్రసేసి - ఒరే ; సాకలీ నీకు ప్రాణాలమీద తీపి వుంటే -

విద్యానగరం ఇడిసిపెట్టి గజపతిసీమలో ఏ ఉదయగిరికో పోయి తలదాసుకో - అని గాంద్రించి గోంద్రించి సెప్పారు.

చిన్నాదేవి: ఆ! నిజమే! మరణశయ్యమీద మతి పోయిన నరసింగ రాయలవారిమాట పాటించటంకోసం- అన్నీ తెలిసిన మహామంత్రి కూడా శిష్యవాత్సల్యం లేకుండా కృష్ణరాయలపై పగ పూనడ మేనా? సామంతదండనాథులు - పౌరులందరకు కృష్ణరాయ లంటే ఎంత గౌరవం!

చాకలి: ఏమిటో! రాజుగారి ఆగ్గె - గురువూ శిష్యుడునా? రాసోరికి తమ్ముడూ లేదు తల్లీ లేదు - ఏదో కులుకుతున్నాడు ఈ తిమ్మ రుసయ్య ఎప్పుడో యీయన రోజూ మూడుతుందని తెలియదు కాబోలు - రాసోరితో నెయ్యమైనా కయ్యమైనా అంతే తల్లీ! ఎవడు గడిసి బతికినోడు?

చిన్నాదేవి: ఆయన రోజు మూడితే ఎవరికి? మూడకపోతే ఎవరికీ? ముందు మన రోజు మూడుతోంది.

చాకలి: సామంతులంతా ఎట్టిమొగా లేసుకొని ఒకరి నొకరు తేరిపార సూత్తున్నారు. అంతే - తిమ్మరుసయ్య కిట్టరాయలోరు పెను కొండలో ఉన్నారని ఆచోకీ తీసి పట్టుకోవాలని పోతూంటే, ఎవరేనా మాటాడగలిగారట - పెద్దనకవిగారైనా కిక్కురు మన్నాడా! నేను ఏమైనా సరే అని తెగించి తిమ్మరుసయ్యకు ఆడ్డం పడ్డాను---అంతే...

చిన్నాదేవి: అయితే-ఏం జరిగింది? కృష్ణరాయలవారు పట్టుబడ్డారా! పెనుకొండలో ఉన్నట్లు ఎట్లా తెలిసింది - అవునులే తిమ్మరుసుకు వారి విషయం తెలియనిదేముంది? ఇంకొకరైతే చచ్చినా పట్టుకో లేరు.

చాకలి : కిట్టరాయలోర్ని పట్టుకోకపోతే నరసింగరాయలోరు తాను సచ్చి పోకముందే తిమ్మరుసయ్య తల నరికిత్తానన్నారట। అందుకని ఆయనే సొయంగా బయలుదేరారట.

చిన్నాదేవి : ఒకవేళ పట్టుబడితే ఆయన్ని ఏం చేస్తారని అనుకుంటున్నారు ?

చాకలి : కిట్టరాయలోర్ని ఏం చేసేదీ ఎవరికి ఏమీ సీమంతకూడ తెలియదు. తిమ్మరుసయ్య - 'ఓరీ సాకలీ। నువ్వు ఇంకా ఇక్కడుంటే నీ పుట్టెకూడా తీయిస్తా'మన్నారు. అది విని కృష్ణరాయలోరి తలకాయ ..అమ్మో।...తల్లీ। ఏం సెప్పనూ।

చిన్నాదేవి : అయితే। యిట్లాంటప్పుడు దొరగారివద్ద ఉండొద్దురా। కాయీ। ఇదా సమయం ఇక్కడ వుండటానికి ?

చాకలి : కాదా। తల్లీ। నేనుండి ఏం సేయగలను ? నన్ను బటులు పాకారం దగ్గరే ఆపుచేశారు - అంతలోకి - ఇంకా ఇక్కడే వున్నావా। అని గద్దిస్తే సచ్చినా ఇప్పుడే ఇక్కడే చస్తా। అరం గుళం గూడ కదలనన్నా।

చిన్నాదేవి : అంటే.....

చాకలి : తిమ్మరుసయ్య—ఓరీ సాకలీ। నీవు పోయి చిన్నాదేవితో పాటాలమిద తీపి వుంటే, తెల్లవారకుండా విద్యానగరం ఇడిసి పెట్టి పొమ్మని సెప్పమన్నాడు.

చిన్నాదేవి : విద్యానగరం విడచిపెట్టాలీ। ఎందుకు విడిచిపెట్టాలి ? కృష్ణరాయలు ఎక్కడ వున్నట్లు ? ఏం జరిగినట్లు।

చాకలి : ఏమో తల్లీ। ఆ ఇసయాలన్నీ తిమ్మరుసయ్యకే తెలియాలి.

చిన్నాదేవి : అవును. అయితే తిమ్మరుసుమంత్రిదగ్గరకే వెళ్ళి తెలుసుకుంటా.

(గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళిపోబోవును)

(తిమ్మరుసు ప్రవేశించి అక్కడే వుంటాడు....తిమ్మరుసును చూచి
చాకలి ప్రక్కకు తప్పుకుంటాడు.)

తిమ్మరుసు : ఆగు!.....చిన్నాదేవీ! మీ కంత శ్రమ కలిగిస్తానా! నేనే
వచ్చాను.

చిన్నాదేవి : ఆఁ! ఆఁ! ఇప్పుడు ఈ అర్ధరాత్రి ఇక్కడకు మహామంత్రి
రావడం ఆశ్చర్యంగా వుందే.....

తిమ్మ : ఆశ్చర్యం అనేమాట నా నిఘంటువులో లేదు.

చిన్నాదేవి: అయితే - ఇపుడు ఇక్కడకు ఎందుకు వచ్చినట్లు?

తిమ్మ : తమకోసమే!

చిన్నాదేవి : నాకోసమా! అయితే ఇక్కడకా రావడము.....

తిమ్మ : ఇపుడు తమరు తమ ఇంటిదగ్గర ఉండరని కృష్ణరాయల
భవనంలోనే ఉంటారని మాకు తెలుసు.

చిన్నాదేవి : శిష్యునిమీదా! నామీదా! మీ కింత అవ్యాజదయ, క్రొత్తగా
ఎందుకు పుట్టిందో? ఎపుడు పుట్టిందో!...

తిమ్మ : నిజం మాట్లాడుతున్నావు. చిన్నాదేవీ! శిష్యునిమీది దయకేం?
నీ కావిషయం అనవసరం—నీమీద ఇంకా పూర్తిగా దయ
పోలేదు. నీ జోలికిరాను. తెల్లవారకుండా విద్యానగరం విడిచి
పెట్టి.....

చిన్నాదేవి : విడచిపెట్టి.....

తిమ్మ : విడచిపెట్టడానికి ముందు యింకోటికూడా చెయ్యాల్సివుంది.

చిన్నాదేవి : ఏమిటది?

తిమ్మ : శ్రీకృష్ణదేవరాయల ఉనికిపట్టులు తెల్పి...

చిన్నాదేవి : నాకేం తెలుసూ!

తిమ్మ : ఏం నంగనాచి నాటకాలు!...నీకు తెలియదా!

చిన్నాదేవి : అమ్మయ్య! బ్రతికాను. శ్రీకృష్ణదేవరాయలవారు మీచేతికి దొరకలేదన్నమాట - మరచిపోవద్దు!...ఎప్పటికైనా గురువు గారికి చదువు చెప్పగల శిష్యుడు ఒక్క శ్రీకృష్ణదేవరాయలే...

తిమ్మ : అధికప్రసంగం ~~అనవసరం~~ చెప్పు? శ్రీకృష్ణదేవరాయలు ఎక్కడికి పారిపోయాడు. ఇది రాజాజ్ఞ.

చిన్నాదేవి : మహామంత్రీ! శ్రీకృష్ణదేవరాయలవారి ఉనికిపట్టులు నాకు తెలియవు. తెలిసినా చెప్పను - మీ రాప్రశ్న వేయగూడదు. నేను బదులు చెప్పకూడదు.

తిమ్మ : నీవు చెప్పటం మాకు ఉపకారం చేయటానికి కాదు. నిన్ను రక్షించుకోటానికే—కృష్ణరాయలు దొరకటం రెండు క్షణాలు తెలిసిందా! మహారాజు మరణశయ్యమీద, బాలయువరాజుకు సింహాసనము నిరాఘాటముగా సంక్రమించాలని తమ్ముడు శ్రీకృష్ణరాయలను అంతమొందించడానికే అవశ్యం ఆలోచిస్తా డని నీకు తెలియదా!

చిన్నాదేవి : ఆ! అయితే విద్యానగరరాజ్యాన్ని దక్షిణాపథాన్ని సంర క్షించటంకోసం సమర్థుడు జగదేకవీరుడు కృష్ణరాయలు సింహా సనం అధిష్ఠించాలని మీరేకదా...

తిమ్మ : ఎవరు చెప్పారు? నేనా! రాజద్రోహానికే ఒడిగట్టడం! ఎంత మాట. ఇంకా చక్రవర్తి నరసింగరాయలు తుది నిశ్వాసం విడిచి పెటలేదు. తెలిసిందా?

చిన్నాదేవి : తెలుసు...పోనీ! నరసింగరాయలవారు తుది నిశ్వాసం విడిచిపెట్టిన తర్వాతనే కృష్ణరాయలను...

తిమ్మ : అంతేనా! చిన్నాదేవీ! నీవు దేవేరివి, మహారాణివి కూడా కావాలని లేదూ? పిచ్చి కృష్ణరాయల మాటలు విని నీవు పగటి కలలు కంటున్నావు కాబోలు. రాజద్రోహం తలపెట్టి చక్రవర్తి

కుమారుల చంపించి తమ్ముడు కృష్ణదేవరాయలను సింహాసనం ఎక్కించేది నేనా ?

చిన్నాదేవి : మహామంత్రీ ! మీ రీ వాగ్దానం శ్రీకృష్ణదేవరాయలకు చేయలేదా ? త్రికరణశుద్ధిగా చెప్పండి...

తిమ్మ : ఆగు ! కృష్ణరాయల మనస్సు కనుక్కోవాలని పన్నిన పన్నాగ మది. లేకపోతే అతని మనస్సులో వున్న కుట్ర నా కెట్లా తెలుస్తుంది ?

చిన్నాదేవి : ఆ ! ఆ ! నిజమే !

తిమ్మ : విద్యానగర సామ్రాజ్య మిథ్యా చక్రవర్తినీ ! విను ! ఎందరికో జీవన్మరణసమస్య అయిన యింత పెద్దవిషయము - ఆడడానితో చెప్పిన ఆ అమాయికచక్రవర్తి కృష్ణదేవరాయలా, కవిత్వం చెప్పటానికి పనికిఏస్తాడేమో ! కాని, సామ్రాజ్యం ఏలడానికి, పనికిరాడు—

చిన్నాదేవి : అయితే మహామంత్రీ ! మీకు కుట్రూష చేసి శిష్యుడైంది యిందుకేనా ?

తిమ్మ : ఒక ఆడుదాన్ని. వేశ్యను, మహారాణిని చేయాలని, యువరాజును త్రోసిరాజని సింహాసనం ఆక్రమించాలని కుట్ర పన్నమని నే చెప్పానా ? విను - నీకు గత్యంతరం ఒక్కటే - చెప్పలేదా ! మీ చాకలి—ఏడి ! చాకలీ !...

చిన్నాదేవి : ఇక్కడ లేడే !...

తిమ్మ : అబద్ధం...ఇక్కడే వుండాలి - ఈ యింటిచుట్టూ విచ్చుకత్తులతో నరపతి సేనలు కాపలా వున్నాయి—చీమకూడా తప్పించుకొని పోలేదు. జాగ్రత్త ! ఏడి ! చాకలి !—ఏరా ! కాయీ !

చాకలి : (ప్రవేశం) నేను మా కిట్టరాయలోరితోనే—యిక్కడే...

తిమ్మ : గింజుకోకు ! ఆలోచించుకో - వెళ్ళిపోతే ఈ క్షణంలో నిన్ను వదలిపెడతాను. లేకపోతే నీ పుట్టె...

చాకలి : మా కిట్టరాయలోరికంటే యీ కాయిగాడి పుట్టె ఎక్కువయిం దేంటి ! సచ్చినా బ్రతికినా యిక్కడే....ఒక్క అరంగుళంకూడ కదలను...

చిన్నాదేవి : నరసింగరాయలవారి పరాక్రమం, తిమ్మరుసు ఘటిలరాజ నీతి రాజకుమారుడు కృష్ణరాయలమీద చూపితే చాలదా ! నిర్భాగ్యుడు ! యీ చాకలిమీద ఎందుకింత పగ ! పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా !

తిమ్మ : ఒక్కొక్కప్పుడు పిచ్చుకలే బ్రహ్మాస్త్రానికి లొంగవు. వలలో సింహం చిక్కుతుంది కాని ఎలుకలు పడవు. అధికప్రసంగం అనవసరం. చెప్పు. కృష్ణరాయలు ఎక్కడ వున్నాడో ! నిన్ను వదలిపెట్టేస్తాం !....

చిన్నాదేవి : కృష్ణరాయలవారు దొరికితే మీరు ఏం చేస్తారో చెప్పితే...

తిమ్మ : చిన్నాదేవీ ! నిన్ను నేను ఆ కృష్ణరాయల ఆచూకీ యాచించ టానికి రాలేదు. కృష్ణరాయలు దొరికితే ఏం చేస్తామో చెప్పాలా ! ఎందుకు ? దొరికిన తర్వాత ఏంచేశామో నీవు కళ్ళారా చూద్దువు గాని. అదుగో ! నా రథంలో వున్నాడు...

చిన్నాదేవి : ఆ ! ఆ !...(ముందుకు పోబోవును)

తిమ్మ : (కత్తితో ఆపుతూ) - ఆగు ! - (గంట మ్రోగించును.)

(భటుడు శ్రీకృష్ణదేవరాయలను తీసికొని వస్తాడు— రాయలకళ్ళకి గంతలు. రక్తం కారుతూ పచ్చిపచ్చిగా కనులు కనువిస్తుంటాయి.)

చిన్నాదేవి : ఆఁ ! ఆఁ !! అమ్మో ! కళ్ళు పీకేసారా !—ప్రభూ ! ఇంక మీ కీ ప్రపంచం, నాకు యీ బ్రతుకు చిమ్మ చీకట్లు క్రమ్మకొనే క్రుళ్ళిన వల్లకాడేకదా ! మహామంత్రీ ! రాజపుత్రుని గ్రుడ్లు తీయించడానికి నీకు చేతులు ఎట్లా వచ్చాయి—(అని వీడుస్తూ శ్రీకృష్ణదేవరాయల కాళ్ళమీద పడుతుంది.)

శ్రీకృష్ణదేవరాయలు : ఆగు ! చిన్నాదేవీ ! ఆగు !

చాకలి : పెబువులోరికి ఎట్టి అవత్త కలిగింది. (కొళ్లుపట్టుకొని ఏడుస్తాడు)

చిన్నాదేవి : కనులు బ్రతుకు వెల్లువ వెల్లిపరిసే వెలుగుబాటలు. కనులు మాటాడగలవు. కనులు ఆజ్ఞాపింపగలవు. కనులు అవమానించ గలవు. కనులు అర్థించగలవు. కనులు నవ్వగలవు. కనులు చెప్పే కవిత్వం నాలుక చెప్పగలదా! కనులు లేకపోతే జీవిత మంతా ఒకే ఒక అమావాస్య!

తిమ్మ : అవును. మొగవాళ్లు నాలుకతో వాగుతారు. ఆడవాళ్లు కళ్ళతో కవిత్వం చెపుతారు.

చిన్నాదేవి : మహామంత్రీ! మీకు చేతులు ఎట్లా వచ్చాయి. మీకు హృదయం లేదా! మీ దగ్గర అర్థశాస్త్రం చదువుకున్నారే శిష్య వాత్సల్యమైనా లేకుండా యిదేం ఘోరం....

(అని వెక్కి వెక్కి ఏడుస్తుంది.)

శ్రీకృష్ణ : ఆగు దేవీ! నీవు నా కోసం విచారించనక్కర్లేదు. గురుదేవుడు అనుకొన్న తిమ్మరుసు చేతిలోనే నా జీవితం మారిపోయింది—ఎందుకా ఏడుపు?—ఆగు!...శాయీ...ఆగు...

చాకలి : చిత్తం దేవర! పెబువులోరి యిష్టం.

శ్రీకృష్ణ : ఇప్పుడు ప్రభువుగా నన్ను గుర్తించే వాళ్లు కూడ వున్నారురా?

చాకలి : మీ ఉప్పు తిని పెరిగాయి ఈ కండలు. మీరే మాకు పెబువులు మీ మాటకు ఎదురే?

శ్రీకృష్ణ : అయితే విను—తిమ్మరుసయ్య నిన్ను ఉదయగిరి పోయి తలదాచుకోమన్నారుగాదా!

చాకలి : అవును. ఇల్లాంటప్పుడు తమ పాదాలకాడ ఉండాలికదా? అంతేకాని పిరికిపందలా వుడాయిత్తానా?

శ్రీకృష్ణ : అది కాదురా! నా కోసం ఎవరూ వృథాగా బలి కావద్దు-పో-వెంటనే గజపతిసీమకు పారిపో.

చాకలి : చమించండి బాబయ్యా! తమ పాదాలకాడ ఉండి సాకిరి చేత్తాను. కిట్టరాయలోరి సాకలాడు వుట్టి పిరికి యెదవ పారిపో యాడు అనరండి బాబయ్యా!

శ్రీకృష్ణ : ఓరే కాయీ! రాయలవారి మాట వింటారు కాని ఈ గ్రుడ్డివాని మాట.....

చాకలి : మాపెబో! ఆ మాట అనొద్దు. తమ మాట కెదురే! ఇపుడే పోతాను. సెలవు - రాయలోరి ఆగ్గె.అంతే-ఎలుతున్నా...తిమ్మ రుసయ్య తల తీసేత్తాడని భయంమాత్రం కాదు. దొరగారు నేనెల్లాగైనా నాలుగుకాలాలు బ్రతికిఉండాలని యీ యెత్తు పన్నారు. అంతే– కాని, నాకు తమదగ్గర లేకుండా బ్రతికివుండడంకంటె సావటం మేలు.

శ్రీకృష్ణ : సరే–సంతోషం. నా మాట రాజశాసనంలాగ చెలామణీ అవు తోంది అన్నమాట. వెళ్లు-ఇపుడు నేను రాయల్నిఐనంత సంతో షిస్తున్నాను.

చాకలి : శలవు. యిక్కడ జరిగిన గోరం అందరికీ సాటుకుంటూ పోతా.....

తిమ్మ : నీ మాట పట్టించుకొనేది ఎవరురా? నోరు నొప్పి పెట్టేవరకూ వాగుకుంటూ పో...

(చాకలి నిష్క్రమణము)

చిన్నాదేవి : ప్రభూ! ఈ చాకలికి మీరంటే ప్రాణం. ఇట్లాంటప్పుడు వీడిని పంపించివేయటం...

శ్రీకృష్ణ : నిజం. యీ స్థితిలో నీవుకూడా ఇక్కడ వుండటం అంత మంచిది కాదు. గజపతిసీమలో...ఏ ఉదయగిరి దుర్గానికో...

చిన్నాదేవి : ఆమాట అనకండి. ఈ స్థితిలోనే ఇక్కడ వుండవలసింది. మీరే రాయలు అయితే అంతఃపురం వేలకు వేలు రాణీలతో కిటకిట లాడుతూ వుండేది. కాని ఇపుడు....

శ్రీకృష్ణ: కాని ఇపుడు - నీవు తప్ప నన్ను కనిపెట్టుకొని వుండే స్త్రీ ఎవరూ లేరని నీ అభిప్రాయం కాదోలు—పోనీ ఆమాట ఎందుకు ? తిమ్మరుసుకు నీవూ నేనూ కలసి వుండడం సుతరాం ఇష్టం లేదు.

చిన్నాదేవి: అవును అది వెనుకటి మాట. మిమ్మల్ని చక్రవర్తిని చేయాలని అనుకున్నాడేమో ; చక్రవర్తికి నేను దేవేరిగా ఉండటానికి పనికిరానేమో గాని మీ కిప్పుడు చరణదాసిగా ఉండటానికి గూడ తగనా ; మీ గ్రుడ్లు పీకించినట్లే నా తల తీయించవచ్చు. ముందు నా తల తీయించి మీ కళ్ళు పీకిస్తే బాగుండేది.

తిమ్మ: చిన్నాదేవీ ; నీ తల తీయించటం పెద్ద సమస్య కాదు.

చిన్నాదేవి: నా తల కృష్ణరాయల కన్నులకంటేనా ?

తిమ్మ: ప్రభువులు కన్నులున్నా ఎపుడూ గ్రుడ్డివాళ్లే ;

శ్రీకృష్ణ: కన్నులున్న హృదయవిహీనులకంటే హృదయంవున్న గ్రుడ్డివాళ్ళే మెరుగు. పిచ్చిదానా, నీవు విద్యానగర సమ్రాట్టుకు దేవేరిగా వుండటానికే పనికివస్తావు. కాని—తిమ్మరుసు ఈ గుడ్డి ప్రభువుకి చరణదాసిగాకూడ నిన్ను ఉండనివ్వడు. నా మాట విని ఏ ఉదయగిరికో....లేక మరెచ్చటికైనా...

చిన్నాదేవి: ప్రభూ ; తిమ్మరుసు నా తల తీసివేయగలడు. కాని అంత వరకూ నా హృదయేశ్వరుని సాన్నిధ్యంలోనుంచి విడదీయలేడు.

శ్రీకృష్ణ: అయితే ఇది నీ నిశ్చితాభిప్రాయమేనా ?

చిన్నాదేవి: ఆఁ ; అక్షరాలా ? ఒకనాడు దేవేరిగా వుండాలని ఎంత ఉబలాటపడ్డానో, ఈనాడు మీ చరణదాసిగా వుండటానికి అంత ఆదుర్దా పడుతున్నా.

శ్రీకృష్ణ: నీలో మహారాణి కవళికలు ఎన్నో వున్నాయి. దేవీ ; నీవే నా దేవేరివి—జీవితేశ్వరివి.....

తిమ్మ : ఆగు ! రాజకుమారా ! నేడు ఇట్లాంటి స్థితిలోనే నా మాట ధిక్కరించి చిన్నాదేవిని దేవేరీ అంటున్నావే. నిజంగా నీకే సింహాసనం లభింపజేస్తే చివరకు నీ చేతిలో నా గతి ఏంకావాలి?

(ధూర్జటి ప్రవేశం)

ధూర్జటి : నీ గతి ఏం కావాలా ? మహామంత్రీ !—అసలు నీకే కళ్ళు పోవాలి—ఇదేమి ఘోరం ? బంగారు పళ్లెంలో మిలమిలలాడి పోయే కృష్ణరాయల కన్నులు చూస్తేనే కాని ఎవ్వరూ తిమ్మరుసు మంత్రి, ఇంత ద్రోహానికి ఒడి గట్టినట్లు నమ్మలేకపోయారు. సామంతులు, దండనాథులు, పురప్రముఖులు, భటులు, మంత్రులు, అందరూ నిశ్చేష్టులైపోయారు.

శ్రీకృష్ణ : మా అన్నగారు శ్రీ నరసింగదేవరాయలవారికి ఇప్పటికైనా మరణశయ్యమీద మనశ్శాంతి కలిగిందా ?

ధూర్జటి : పాపం ! ఈసంగతి పెద్దనమహాకవి కేం తెలుసు ? ఆ మహాకవి దుందుభివాజ్ఞినాదాలతో దక్షిణాపథం హిందూమతం తురుష్కాక్రాంతం కాకుండా రక్షించాలంటే లోకోత్తరవీరుడు శ్రీకృష్ణదేవరాయలే విద్యానగర సింహాసనం అధిష్ఠించాలని కోటబురుజుల క్రింద నిలిచి దండనాథులకు ఉపన్యాసాలు.....

శ్రీకృష్ణ : అయితే దండనాథులు ఏమంటున్నారు ?

ధూర్జటి : ఈ మాటలు కన్నులు తీసెయ్యకపూర్వం—మరణశయ్యమీద ఉన్న మహారాజుతోనే చెప్పకపోయాడా ? అన్నారు. ఇటు గజపతుల్ని, అటు అశ్వపతుల్ని జయించి విద్యానగర సామ్రాజ్యాన్ని రక్షించాలంటే శ్రీకృష్ణదేవరాయలవంటి జగద్వీరుడే సింహాసనం అధిష్ఠించాలి

తిమ్మ : ఇది కవిగారి పగటికల కాబోలు.

ధూర్జటి : కాదు—జనవాక్యం.

తిమ్మ : జనవాక్యం, జనవాక్యం। ఛీ : 'జనం' అనే మాటకు అర్థ మేమిటి ? ఏపరు జనం ? బహూపచనమే కాని ఏకవచనంలేని ఒక నిరర్థక శబ్దం...జనం.

ధూర్జటి : మహామంత్రీ। ప్రజలలో, దండనాథులలో పెద్దనకవి విప్లవాగ్ని రేకెత్తించాడు—రేకెత్తిస్తున్నాడు. ఇప్పుడు పొగకూడా కనిపించక పోపచ్చు—కాని రేపది ఒక మహాగ్నికుండం కాక తప్పదు.

తిమ్మ : విప్లవంలేదు, గిప్లవం లేదు. ఈ అలజడి అంతా నిముషాల్లో సద్దుకుపోతుంది. విద్యానగరసామ్రాజ్యరథం అప్రతిహతంగా కదలిపోతుంది.

ధూర్జటి : మహామంత్రీ। నిన్నటివరకు నిన్ను మెచ్చుకున్న జనసమూ హంలో, నేనొకణ్ణని, స్మరించుకోటానికి సిగ్గుపడుతున్నాను.

తిమ్మ : నిన్నటివరకు నేను మహానుభావుడను ; తెల్లవారకుండా ఒక అర్ధరాత్రిలో పరమనీచుణ్ణి అయిపోయా నన్నమాట. అట్లా మనుష్యులు — మీ కావ్యప్రపంచంలో మారాలి గాని ఐహిక ప్రపంచంలో ఎపుడూ ఎక్కడా మారరు.

ధూర్జటి : గోముఖవ్యాఘ్రం। ఇక్కడకు [illegible] ఎందుకు వచ్చినట్లు ?

తిమ్మ : ఇంకా కర్తవ్యం పూర్తి కాలేదు కాబట్టి. కవిగారేదో కవిత్వం చెప్పుకుంటూ కలలు గంటూ గుర్రుపట్టి నిద్ర పోకుండా ఎందు కిట్లా అర్ధరాత్రి వచ్చినట్లు...

ధూర్జటి : ఏమిటీ ? తిమ్మరుసుమంత్రి తెలుగు కవులు ఘంటం త్రిప్పి నంతకంటె అవసరమైతే కత్తి ఎక్కువ వేగంగా త్రిప్పగలరని తెలుసుకోవాలి. ఇట్టి అమానుషకృత్యం చేసిన నిన్ను నరికినా పాపం లేదు.....

(కృష్ణరాయల ఒరలోనున్న కత్తిని లాగి దూయును)

శ్రీకృష్ణ : ఆ ।... ఆ ।।....ఎవరది ?. ..ఎవరది ?....

ధూర్జటి : కాచుకో...

తిమ్మ : ఆగు ! మహాకవీ ! కవులతోను, కన్యలతోను యుద్ధం చేయనని
నా వ్రతం. మహాకవికి నమస్కారం.

శ్రీకృష్ణ : మహాకవీ ! చేయెత్తి నమస్కరించిన, మహామంత్రిని దీవించు.

ధూర్జటి : దీవించాలా ?

"గుత్తిన్ బుల్లెలు కుట్టి చంద్రగిరిలో
కూడెత్తి పెన్గొండలో
హత్తిన్ సత్రమునందు వేడి పలు
దుర్గాధీశు తాంబూలపుం
దిత్తుల్ మోసి పదస్థులైన ఘనులన్
దీవింప—"

(అని కత్తితో దీకొనును)

పెద్దన : (వేగంగా ప్రవేశించి) ఆ ! ఆ !! ఇదేమిటి... మహామంత్రీ
ఆగండి. ధూర్జటి కవీంద్రా ! ఇదేం ఘోరం...

శ్రీకృష్ణ : (కళ్ళ గంతలు విప్పి) ఆగు ! మహాకవీ ! ఆగు అప్పాజీ !
(మధ్య నిలుస్తాడు).

ధూర్జటి : ఆ ! ఇది ఇంద్రజాలమా !...(తిమ్మరుసును కౌగిలించుకొని)

"దీవించెదన్ మత్తారాతి యయాతి నాగమసుతున్
మంత్రీశ్వరున్ తిమ్మరున్"

(నేపథ్యం వెనుకనుండి - శతఘ్నిరావాలమధ్య)

వందిమాగధులు : జయజయ, \ స్వస్తిశ్రీ, సమస్త, సద్గుణ స్తోమ భద్ర, \
రణరంగరామభద్ర, \ శ్రీశ్రీశ్రీ \ మహారాజరాజశ్రీ, \ రాజపరమేశ్వర, \
రాజమార్తాండ, \ గండరగండ, \ రాజాధిరాజ, \ వీరప్రతాప, \ హత్తి

బ్బర గండ. \జగనొబ్బర గండ, |కర్ణాటక బుధ ధన్యాసిక. \గిరి దుర్గ. స్థలదుర్గ, వనదుర్గ. జలదుర్గ.| చతురరీతి దుర్గ, \సమస్తదళ విభాళ, \సాహితీ చక్రవర్తి. \శ్రీకృష్ణదేవరాయ భూపాలా| విజయీ భవ \దిగ్విజయీ భవ \

(తర)

★

శ్రీకృష్ణదేవరాయలు

ద్వితీయ రంగం

[స్థలం—ఉదయగిరి]

[ప్రవేశం—పూలగంపతో-పుష్పలావిక మీనాక్షి. వెనువెంట రంగళాయి.]

మీనాక్షి :

కొంచెదనము కనుగొల్కుల చిందెను
పద్మము కోరెదవా సరసుడ !

రంగళాయి :

రాతిరి మొగమును ముడిచెడి పద్మము
నే కోరెదనా నెరజాణా !

మీనాక్షి :

చెంపకు చారెడు కన్నులు విచ్చెను
సంపగి కావాలా చతురుడ !

రంగళాయి :

తుమ్మెద కొదమకు దూరము సంపగి
నా కెందులకే ననబోడీ !

రంగళాయి :

చేమంతి బంతులు చిన్నారి పొన్నారి
పూరెమ్మ మాటున పొదివి తేల ?

మీనాక్షి :

మోటు మనుష్యుల మురికి చేతులు సోకి
కందిపోకుండగా కాయవలదె !

రంగశాయి :

మల్లెమొగ్గల దండ మరుగుపుచ్చగ నౌనె
కెందలిరాకుల సందులందు ?

మీనాక్షి :

అమృత తుషార నిష్యంద తుందిలములు
తలిరాకు దొప్పల దాచవలదె ?

రంగశాయి :

కొదమ తుమ్మెదల్ గుంపులుగూడె నౌర
క్రొత్త సంపంగి మొగ్గపై కొసరి కొసరి !

మీనాక్షి :

చేరెడేసి నేత్రాల వీక్షింతు వౌర
దృష్టిదోషము నీది తప్పింపనౌనె!

మీనాక్షి :

నడివీథులలో తడవుట యేలా
ఇంతలు కన్నులు ఎందుకు చెపుమా !
కలువల మొగ్గలె కావలెనంటే
రాతిరి విచ్చును రారా రాజా
కోటకు లోపలి కొలనుకు కెలకుల
చేరగ రమ్మో నీరజనేత్రా

రంగశాయి :

తెలిసెను నీ హృది చిలుకల కొలికీ
చీకటివేళను చేరెద కొలనుకు
అందము చిందుచు అభిసారికవై
చెచ్చెర రమ్మో సిగ్గుల మొగ్గా.

(నిష్క్రమణము---రంగశాయి ; మీనాక్షి.)

(ప్రవేశం—చాకలి ; తెనాలి రామలింగం)

చాకలి : భేష్ ! భేష్ ! బలే వ్యాపారం-పూల వ్యాపారం-

"వల్లెవాటు వేయ నేర్చినట్టి ఆడదాని చెంత
మీసకట్టు మెలిపి వేయునట్టి మగవాడు ఎంత ?"

రామలింగం : (వెనుకకు చూచుకుంటూ ప్రవేశం)

చాకలి : ఏమయ్యోయ్ ! పల్లెటూరి ఎలుగ్గొడ్డు వాటం ఇటు సూడు.... ఏం....ఆకాసంకేసే - చూస్తున్నావ్ ? ఇటువం టమ్మాయిలు మీ వూళ్ళో లేరా ? మా వూళ్ళో యీది యీదికీ లచ్చలూ, కోట్లూనూ తెలిసిందా ! - ఊ - మం దేవూరంట ?

రామ : మాది తెనాలి. నన్ను తెనాలి రామలింగం అంటారు. కొండవీటి సీమ.

చాకలి : మొగం సూడగానే తెలిసిందిలే ! మొగానికంత బూడిద పటించా వేం ? మీ శ్రీనాథుడు అనలే !

"ఆవగింజంత బూది మైనలమికొనిన
ఎలది గుమ్మడి కాయంత ఎట్టి పుట్టు."

మా వూళ్ళో సూడు, చక్కగా శ్రీచూర్ణం తిరుమణి రేఖలతో కలకల్లాడిపోతూ తిరుగుతారు శ్రీవైష్ణవులు - సాములు.

రామ : మీ వూరు ఈ ఉదయగిరి కాదా ?

చాకలి : ఛీ ! మాది యిజయనగరం. శ్రీశ్రీశ్రీ వీరప్రతాప, రాజపర మేశ్వర గండరగండ శ్రీకిట్టరాయలోరి యింటి చాకల్ని ....

రామ : ఆ ! కృష్ణరాయలవారి చాకలివా ? అయితే ఈ గజపతిసీమలో ఉదయగిరిలో ఎందుకున్నావ్ ?

చాకలి : రాచకీయ రహస్సికాలు యెట్టి బాపనయ్యల కేం తెలుస్తాయి అంట-మొదట మనకే తెలియందే ! ఎందుకు తిమ్మరుసయ్య

నవ్నిక్కడకు తగిలేశాడో ; సరే నీ వెందుకు ఇక్కడకు వచ్చి నట్లు ; మన వ్యాపారం....

రామ : నేను—కవిని.

చాకలి : ఆ ; కవివా ; నువ్వు కవివా ; (అని విరగబడి నవ్వుతూ) నిజంగా నువ్వు కవివే ; బొత్తిగా కుర్రాడివి. నిన్నెట్లా కవివని ఒప్పు కోవాలా అని చూస్తున్నా ;

రామ : కృష్ణదేవరాయల్ని సందర్శించాలని తెనాలినుండి బయలుదేరాను. ఈ ఉదయగిరి చేరేటప్పటికి ఈ కోటను రాయలవారు ముట్టడించా రన్నారు. ఇక్కడ చిక్కుకుపోయాను.

చాకలి : ఏం పరవా లేదు. రాయలవారు కవుల నేం చెయ్యరు. ఇప్పటి నుంచి ఆలోచించి రాయలోరు వచ్చేటప్పటికి స్వస్తి పద్యం ధుమా లాంటిది ఒకటి రాశేయ్.

రామ : ఈమాత్రం దానికి ఆలోచించాలీ ; ఎందుకు? ఆశువుగానే చెప్ప గలను.

చాకలి : అట్లాగా ; అందుకనే అన్నాడు మహానుభావుడు శ్రీనాథుడు ...

"కొండవీటిలో గాడిద నీవునున్
కవివి గావు గదా ? అనుమాన మయ్యెడిన్ ;"

మీ కొండవీటిసీమలో గాడిదలుకూడా యింకా కవిత్తం చెపు తున్నాయా ?

రాము : (కోపంగా) నువ్వు నిజంగా రాయలవారి చాకలివేనా ; నాకు చచ్చినా నమ్మకం లేదు.

చాకలి : ఏం ; ఏమంట ?....

రామ : నువ్వు నిజంగా రాయలవారి చాకలివైతే కవుల నిట్లా దూషిస్తావా?

చాకలి : అమ్మ ; ఎంత మాట యిసిరేశావయ్యా ; బాపనయ్యా ; కాళ్ళు పట్టుకొంటున్నా ; చమించు, ఏదో అనేశా ; నేను రాయలోరి సాకల్నే ; నిజం దేవుని సాచ్చిగా - అమ్మతోడు - నీ మాట రాయ

లోరితో చెప్తాగా: రాయలోరి మనసు కరిగే ఇదానాలన్నీ శెల విచ్చుకుంటాను.

రామ : రాయలోరి మనసు బాగా రంజింప జేయటానికి....

చాకలి : దానికంతా వుందిగా: నే సెప్పినట్టు సెయ్యి. నీ పేరు రామలింగం కదూ, అన్నావు? "రామకిట్ట కవి" అని పేరు మార్చేయ్. ఆవి బూడి మానేసి చక్కగా శ్రీచూర్ణం తిరుమణి పెట్టు. ఇదిగో రాజగురువు తాతాచార్యులవారు ముద్ర వేస్తే "ఎకా - ఎకీ" అట్ట దిగ్గజ చింహాసనం లభిస్తుంది.

రామ : రాయలవారికి ఎంతో పరమతసహనం వుందంటారు...

చాకలి : బాగుపడేందుకు ఎప్పుడూ కొన్ని అడ్డదార్లుంటాయ్. కిటుకులు చెప్తే యినవేమయ్యా: యెర్రిమొగమా: ఏరోజుల్లోనయినా చమర్దతతోపాటు హంగులుకూడా ఏర్పరచుకోవాలి. అపుడే బాగా రాణిసారు...

రామ : సరేకాని, నాలుగు నెలలనుంచి ఈకోటలో చిక్కుకు పోయాను. ఇంకెంతకాలం యీ ముట్టడి?

చాకలి : ఎంతకాలం? రాయలోరు అక్కడ తురకలతో ఇంతవరకూ పోరాడి మొన్ననే "ఏదిల్‌ఖాన్" తలకాయ బళ్ళానికి గ్రుచ్చి ఉత్తరాదిలో దిట్టిపిడతలాగ పాతించారట. నేదో, రేపో రాయలే సొయంగా వస్తే రెండు పూటలు పట్టదు యీ వుదయగిరి దుర్గం....

(తెరలో ఫిరంగిమోత)

రామ : అమ్మబాబో: అదిగో ఫిరంగిమోత: మనమీద పడ్తుందేమోరా? పోదాం...

(అని పరుగెత్తుకు పోవును.)

చాకలి : పోవయ్యా: పిరికి బాపనయ్యా: నేను చెరువుకాడ బట్ట లాతు కోవాలి...

(అంటూ విరగబడి నవ్వుతాడు.)

(తెర)

శ్రీకృష్ణదేవరాయలు

మూడవరంగము

[స్థలం— విజయనగరం ; చిన్నాదేవి సౌధం]

(చిన్నాదేవి వీణవాయించుచుండును - ప్రవేశం పగడాల వర్తకుడు)

చిన్నాదేవి : ఎవరు మీరు ?

1 పగడాల వర్తకుడు : మేం పగడాల వర్తకులం.

చిన్నాదేవి : ఆశ్చర్యంగా వుందే - అడగకుండానే ఇంట్లో ఎట్లా ప్రవేశింపగల్గాను ?

1 పగ. వర్త : అమ్మా ! ఇంతవరకు నీ వొక్కదానివే యీ ప్రశ్న వేశావు.

చిన్నాదేవి : అయినా - మీ రిక్కడకు ఎందుకువచ్చారో తెలియటం లేదు. మీరు దయచేసి వెంటనే వెళ్ళిపోవచ్చు.

1 పగ. వర్త: నన్నిక్కడకు శ్రీకృష్ణదేవరాయలవారు రమ్మన్నారు. ఇంక మీ ఆజ్ఞ అయినదని వెళ్ళిపోవాలి.

చిన్నాదేవి : రాయలవారు రమ్మన్నారా ? వా రిప్పు డిక్కడకు వచ్చే సంగతి మీతో చెప్పారా ? అయితే ఇది మరీ ఆశ్చర్యంగా వుందే.....

1 పగ. వర్త : ఏ మమ్మా ! నీ కంతా ఆశ్చర్యమే. చూడు - నీ జీవితం కంటే ఆశ్చర్య మేముంది ? నిన్నటి ఒక వేశ్య నేటి రాయల రాణి.

చిన్నాదేవి : అమ్మో ! ఈ రహస్యం నీ కెట్లా తెలిసింది - నువ్వెవరవో... ఇదంతా వింతగా వుందే....

1 పగ. వర్త : ఈ చిదంబర రహస్యం ఎవరికీ తెలియదు ? లోక మంతా కోడై కూస్తూంటేను....

చిన్నాదేవి : ఆ ! నిజమా ? లోకాని కెందు కీ విషయం.

1 పగ. వర్త : రాయలవారి విషయం కాబట్టి రాజ్యాని కంతకీ కావల సిందే. రాయ లొక వేశ్య వలలో చిక్కి తే రాజ్య వినాశనం కాక మరేమున్నది.

చిన్నాదేవి : ఈ పాడులోకం మా పవిత్రప్రేమ ఏ మర్థం చేసుకోగలదు? నాకు ఈ లోకంతో పనేమిటి ? రాయలవారికీ, వారి కర్తవ్య మేమిటో, నిర్ణయించుకోగల శక్తి ఉన్నది. దయవుంచి మీరు వెంటనే వెళ్ళిపొండి.

1 పగ. వర్త : తిమ్మరుసు నరసింగదేవరాయలవారిని మోసగించి బాల యువరాజును చెరసాలలో పెట్టించి శ్రీకృష్ణదేవరాయలను సింహాసనం ఎక్కించిన దెందుకు ? విద్యానగర సామ్రాజ్యాన్ని ఒక వేశ్య చేతిలో పెట్టటానికేనా ?

చిన్నాదేవి : ఆయితే ! ఇక పవిత్రప్రేమకు చోటు లేదా ?

1 పగ. వర్త : పవిత్రప్రేమ - అంటే అర్థం ? చిన్నాదేవీ ! నీ అంతరం ఏమిటి ? రాయల అంతరం ఏమిటి ? నిన్ను రాణీగా స్వీకరిస్తే రాయలు, రాయల రాజ్యం నశించక తప్పదు. నిజంగా నీకే పవిత్ర ప్రేమ వుంటే స్వార్థాన్ని స్వచ్ఛందంగా త్యాగంచేసి రాయల్ని మరచిపో. నీవు రాయల్ని మరచిపోతే, దక్షిణాపథ చరిత్ర రాయల్ని శాశ్వతంగా జ్ఞాపక ముంచుకొంటుంది. నీవు - రాయల్ని మరచిపోకపోతే రేపటినుంచే చరిత్ర శ్రీకృష్ణదేవరాయల్ని మరచి పోతుంది.

చిన్నాదేవి : అమ్మో ! నువ్వెవరవో ... ఏ గూఢచారివో - నేను ఇక్కడికి ఏ పగడాల వర్తకుణ్ణి రమ్మనలేదే ! ఎందు కీ వితండవాదం - ఒకవేళ యిక్కడకు శ్రీకృష్ణదేవరాయలవారే వస్తే నీ గతి ఏమవుతుందో తెలుసా. పో ! వెంటనే వెళ్ళిపో.

(రెండవ పగడాల వర్తకుడు ప్రవేశం)

1 పగ. వర్త : ఈ పగడాల వర్తకుణ్ణి దేవిగారే రమ్మన్నారా ?

2 పగ. వర్త : మీతో నాకు పోటీ లేదు. మీరే బేరం యివ్వండి.

1 పగ. వర్త : అయితే మీరు ఉచితంగా దేవిగారికి పగడాలు సమర్పించ డానికి వచ్చా రన్నమాట.

చిన్నాదేవి : చయవుంచి ఉభయులూ వెళ్ళిపొండి.

2 పగ. వర్త : అయితే రావయ్యా ! పోదాం.

1 పగ. వర్త : నేను రాను. నేను వెళ్ళిన తర్వాత - నీవు మళ్ళీ తిరిగి రావాలని యెత్తు.

2 పగ. వర్త : ఒకవేళ రాయల భటులుగాని, రాయలుగాని వస్తే...

1 పగ. వర్త : రాయలు ఇపుడు ఇక్కడకు వచ్చేటంత అవివేకి అని నేను నమ్మను. అతనికీ, చిన్నాదేవికీ గల సంబంధం జగ ద్విదితం. ఈ అర్ధరాత్రి - ఇక్కడనుంచి, ఏ శత్రువులైనా చేతులూ, కాళ్ళూ విరిచి రహస్యంగా రాయలవారిని మోసుకొని పోయినా తెల్లవారేవరకూ రాయలసీమ అంతా గుట్టుకొట్టి నిద్ర పోతూనే వుంటుంది.

2 పగ. వర్త : అయితే నీ వెవ్వరితో మాట్లాడుతున్నావో తెలుసా ?

1 పగ. వర్త : ఆఁ తెలియకేం - చిన్నాదేవి చేతి కీలు బొమ్మతో - ఒక మృగతృష్ణను వలచి వెంబడించే, అవివేకచక్రవర్తితో ! విద్యా నగరసామ్రాజ్యాన్ని శత్రువుల దృష్టిదోషంనుండి రక్షించటానికి, తిమ్మరుసు సింహాసనంమీద నిలబెట్టిన పేడ బొమ్మతో...

2 పగ. వర్త : ఆఁ ! అయితే దొంగవాటుగా ఇక్కడ నన్ను మోసగించి బంధించాలని వచ్చా వన్నమాట. నీ దుస్తుల మాటునుండి రహస్యంగా తొంగిచూచే నీ ఖడ్గమే నీ దురుద్దేశానికి ప్రత్యక్ష నిదర్శనం...(కత్తిదూసి) కాచుకో...

1 పగ. వర్త : ఆగు ! రహస్యంగా వున్నది నా కత్తి ఒక్కటే కాదు. ఈ యింటిచుట్టూ గూఢచారులై యెందరు భటు లున్నారో

తెలుసా ? నీకు ప్రాణాలమీద తీపి వుంటే లొంగిపో - నిన్ను చంపటంకంటె బందీగా పట్టటమే నాకు శ్రేయస్కరం....

శ్రీకృష్ణ : (పై వేషం లాగివేసి) నిన్ను నీ భటుల్ని నా కత్తికి బలి ఇస్తాను. (కత్తి దుళిపించి) కాచుకో. నా ఖడ్గం కూడా రక్త దాహాన్ని కోరుతోంది.

1 పగ. వర్త : (పై వేషం తీసివేస్తూ) రాజాధిరాజ, రాజ పరమేశ్వరు లతో కత్తికలపాలనే ఉత్సాహం - ఉపసంహరించుకొంటున్నాను.

శ్రీకృష్ణ : (తిమ్మరుసును కౌగిలించుకొని) అప్పాజీ ! నేనే నిన్ను గుర్తు పట్టలేకపోయాను. ఈ అర్ధరాత్రి - నీవే కాబట్టి సరిపోయిందికాని నిజంగా శత్రువులే అయితే....

తిమ్మరుసు : శత్రువులే వచ్చి వుండే వాళ్లు. కాని వాళ్లను పట్టుకొని బంధించి నేనే వచ్చాను. ఈ అర్ధరాత్రి నీ పిక్కదుంటావని నే నిజంగా నమ్మలేదు. మనలోట్లు మనకు తెలియకపోయినా శత్రువులకు మాత్రం బాగా తెలుస్తాయి.

శ్రీకృష్ణ : అప్పాజీ ! నీ ఋణం వేయి జన్మ లెత్తినా తీర్చుకోలేను - నీవే నా తల్లివి, తండ్రివి, దైవానివి కూడా.

చిన్నాదేవి : అప్పాజీ ! మీరు చేసిన ఉపకారం అజన్మాంతం మరువలేము.

తిమ్మరుసు : మీకు నే నేమీ ఉపకారం చెయ్యటం లేదు. ఇది నా విధ్యుక్త ధర్మం. ఆనాడు—నరసింగదేవ రాయలవారి కుమారుడు—ముక్కపచ్చలారని పసికందు సింహాసనం ఎక్కితే విద్యానగర సామ్రాజ్యం ముక్కచెక్కలై పోయేది. అందుచేతనే శ్రీకృష్ణ రాయలను సింహాసనం ఎక్కించాను. సామ్రాజ్య సంరక్షణకోసం అవసరమైతే శ్రీకృష్ణదేవరాయలవారి కుమారుణ్ణి కూడా హత్య చేయడానికి జంకను.

శ్రీకృష్ణ : అ !

తిమ్మరుసు : అవును. సామ్రాజ్య సంరక్షణకోసం మన ప్రేమపాశాన్ని త్యాగం చెయ్యాలి—అందుచేత చక్రవర్తికూడా ప్రేమబంధాన్ని త్రెంచుకొని చిన్నాదేవిని విడిచిపెట్టాలి.

శ్రీకృష్ణ : అప్పాజీ! ఆమె నిష్కళంకప్రేమ మీకు తెలియనిది కాదు. శ్రీకృష్ణ దేవరాయలు రాజయితే, ఆమె రాణి కాక తప్పదు. ఈ వాగ్దానం ఆమెకు ఎపుడో చేశాను—చిన్నాదేవిని వదలిపెట్టటం కంటే తేలికగా నేను ఈ సింహాసనాన్ని—కిరీటాన్ని త్యజిస్తాను.

తిమ్మరుసు : ఈ ఉపన్యాసం వినటం ఇది మొదటిసారికాదు—చిన్నాదేవిని విడచిపెట్టక తప్పదు.

చిన్నాదేవి : అప్పాజీ! నేను మీకు ఏ మపకారం చేశాను? మా ప్రేమ బంధాలు తెంపకండి....

శ్రీకృష్ణ : గురుదేవా! సింహాసనం ఒక స్వర్ణపంజరమై, రత్నకిరీటం మోయలేని ముండ్లగంపగా, అంతఃపురం ఒక స్వచ్ఛంద కారాగారంగా నేను బ్రతుకలేను. చిన్నాదేవిని నేను దేవేరిగా స్వీకరించటానికి నిశ్చయించుకొన్నాను. లేదా (ఖడ్గం అందిస్తూ) ఈ మోయలేని బరువు సంతోషంతో మీ పాదాల దగ్గర దించేస్తాను....

చిన్నాదేవి : అప్పాజీ! మీ పాదాలు బట్టి వేడుకొంటున్నాను. కరుణించండి.

తిమ్మరుసు : (ఆలోచించి) సరే. నీ యిష్టం....

శ్రీకృష్ణ : సంతోషం. ఈనాడే నేను రాయలైనందుకు సంతోషిస్తున్నాను.

తిమ్మరుసు : బాగుంది. ఒక వేశ్యను చేరదీసి, దేవేరిని చేసి - యేదో త్రైత్రయాత్ర సాధించి కటకం చక్రవర్తి వీరభద్ర గజపతి కూతుర్ని అంతఃపురం చేరుస్తూన్నట్లు సంతోషిస్తున్నావే!! నీవు ఒక వేశ్యను ఏలటానికి నిశ్చయించుకున్నందుకు నేను సంతోషించగలనా? నా ప్రభువు కటకంనుండి కన్యాకుమారి వరకూ ఏలగలిగిననాడే నాకు సంతోషం....

శ్రీకృష్ణ : అప్పాజీ ! మేఘగర్జనవంటి నీ వాక్కులో విజయదుందుభులు మారుమ్రోగుతున్నాయి. రేపే - పూర్వ దిగ్విజయయాత్రారంభం- ఇదిగో కటకం జయించి వీరభద్రగజపతి కూతుర్ని అంతఃపురం చేర్చిన మరునాడే-ఇక చిన్నాదేవికి మా పునర్దర్శనం....

చిన్నాదేవి : ప్రభూ ! ఇ దేమన్యాయం ! నేనేమి నేరం చేశాను ?

శ్రీకృష్ణ : చిన్నాదేవీ ! మా మాటకు తిరుగులేదు.

తిమ్మరుసు : అయితే నాల్గు నెలలనుండి ఉదయగిరి ముట్టడిలోనే మన భటు లున్నారు గదా ? ఇక కటకం ముట్టడి ఎంతకాలం పడు తుందో ? చిన్నాదేవికి నీ పునర్దర్శనం బహుశా ఈ జన్మలో లభింపదేమో ?

శ్రీకృష్ణ : అప్పాజీ ! నీ ప్రోత్సాహానికి ధన్యవాదాలు ఇదిగో ! ఖడ్గ సాక్షిగా ప్రమాణం స్వీకరిస్తున్నాను. సరిగా మరల ఈ వారమే ఉదయగిరి దుర్గాధిపతి, ప్రహరేశ్వరపాత్రుని శిరస్సు ఖండించి, తన్ని స్నానం చేసిగాని ఆనాడు ఆహారం స్వీకరింపను.

తిమ్మరుసు : సంతోషం నాయనా సంతోషం. చిన్నాదేవీ ! ఇది శ్రీకృష్ణ దేవరాయలు పూర్వదిగ్విజయయాత్ర ఆరంభించుచున్న శుభ తరుణం. ఈ శుభముహూర్తం తలచుకొని దక్షిణాపథచరిత్ర పులకిస్తుంది. రాయలు పూర్వదిగ్విజయయాత్రనుండి తిరిగిరాగానే నేనే నిన్ను స్వయంగా రాణివాసానికి అంతఃపురమర్యాదలతో తీసుకొని వెడతాను. వీరపత్నివై శ్రీకృష్ణదేవరాయలకు కర్పూర నీరాజనం సమర్పించు...కుమారా ! విజయీభవ ! దిగ్విజయీభవ !

చిన్నాదేవి : (కర్పూరహారతి యిస్తూ)

"గంగాస్వచ్ఛతరంగభంగికయశోగాఢచ్ఛవిచ్ఛన్న సా
రంగాంకాంక నిరంకుశప్రతికళాప్రౌఢిప్రియంభావుకా !
గాంగేయాచలచాపనూపురవచోగాంభీర్యలీలాస్పదా !
బంగాళాంగకళింగభూపసుభటాభ్రశ్రేణియుంయూనిలా !"

భూపసు (తెర)

శ్రీకృష్ణదేవరాయలు

నాల్గవరంగము

[స్థలం— ఉదయగిరి దుర్గం. దుర్గాధిపతి— ప్రహరేశ్వరపాత్రుడు సింహాసనం అధిష్ఠించి ఉంటాడు. ప్రక్కన దళవాయి తిరుపతిమల్లు]

(ఇద్దరు భటులు. రంగశాయిని ఖైదీగా పట్టుకొనివస్తారు)

తిరుపతిమల్లు : మహాప్రభూ ! ఎంత వేధించినా ఈ రంగశాయి బెల్లం కొట్టిన రాయి వలె, ముంగిలా, మాట్లాడడు. ఇతడు ఎవరో తెలియడం లేదు. మూడు నాళ్ళనుంచీ ఇతనితో విసిగి వేసారి పోయాము.

పాత్రుడు : రంగశాయీ ! నిజం చెప్పు. అర్ధరాత్రి ప్రాణాన్ని త్యజించి మా దుర్గప్రాకారం ఎక్కి లోపలకు ఎందుకు ప్రవేశించావు ? గూఢచారులై ఉదయగిరి దుర్గంలోకి ప్రవేశించేవాళ్ళు ఇదివరకు ఏమి శిక్ష అనుభవించారో నీకు తెలియదా ? దుర్గంముందు సింహద్వారంలో ప్రేలాడే కపాలతోరణం చూడలేదూ ?

రంగశాయి : నేను గూఢచారిని కాను.

పాత్రుడు : అయితే అంత అర్ధరాత్రి ప్రాకారం ఎక్కి ఎందుకు లోపలికి ప్రవేశించావు ?

రంగశాయి : సింహద్వారం మూసివుంది కాబట్టి ప్రాకారం ఎగబ్రాక వలసి వచ్చింది.

పాత్రుడు : అట్లాగా— రాయలసేనలు చుట్టూ ముట్టడించి ఉన్నప్పుడు సింహద్వారం ఎట్లా తెరచివుంచుతాము ?

రంగశాయి : ఆ ! మన దుర్గాన్ని రాయలు ముట్టడించారా ! ఆ విషయం నా కెట్లా తెలుస్తుంది ?

పాత్రుడు : దుర్గంచుట్టూ యిప్పటికే నాల్గు నెలలనుండి రాయల సేన లున్నాయి. మనం కాబట్టే గదా ! రాయల ముట్టడికి తట్టుకో గలిగింది. చూడు— మన దుర్గం అంటున్నావే—మీ దీ వూరేనా ? ఈ వూళ్ళో నిన్నెరిగినవాళ్ళెవరైనా వున్నారా ?

రంగ : లేకేం ! ఈ స్థితిలో నేను పట్టుబడ్డట్టు నన్నెరిగినవాళ్ళెవరూ తెలుసుకోటం నా కిష్టం లేదు. అదీగాక—మా దీ వూరు కాక పోయినా నేను ఉదయగిరిసీమలోని వాణ్ణి—ఏలినవారి పాలన క్రింది వాణ్ణే.

పాత్రుడు : అయితే నీవు శత్రువుల పక్షాన వచ్చిన గూఢచారివి కావని మా కెట్లా రుజువు—ఏం ? తిరుపతిమల్లూ ఇతని జాడ ఏమైనా తీశారా ?

తిరుపతి : మహాప్రభూ ! యుద్ధంలో పట్టుబడిన రాయలవారి భటు లెవరూ ఇతన్ని గుర్తుపట్టలేక పోయారు.

పాత్రుడు : అమ్మో ! రాయల భటులను ఎవరు నమ్ముతారు. యుద్ధ భూమిలో ఉగ్రసింహాలు, మనచేతికి చిక్కినప్పుడు గుంటనక్కలు. రంగశాయీ నా మాట విను. వృథాగా చచ్చిపోకు—ఏదో గూఢ చారిగా వచ్చావు. మాకు రాయల గుట్టు మట్లు సేనల ఆచోకీ చెప్పేస్తే నీకు ప్రాణభిక్ష పెట్టటమే గాక—మంచి బహుమానం—యిస్తాం. ఆలోచించుకో- లేదా ? నీ పుట్టె సాయంకాలం కపాల తోరణంలో కొలికిపూసలా వ్రేలాడుతుంది.

రంగ : అయ్యో ! పరమేశ్వరా ! నేను ఎప్పుడూ యుద్ధభూమినైనా చూడలేదు. తెలియని విషయం నేనెట్లా చెప్పేది.

పాత్రుడు : సరే నీ మొండితనం నాదగ్గరా ! వీడిని గాడిదమీద ఊళ్ళో నడివీధిలో చాటిస్తూ ఊరేగించి తల నరికి పుట్టె కపాలతోరణంలో ఎక్కించండి. ఈలోగా వీడి ఆచోకీ ఏమైనా తెలిసిందా చంప

కుండా నాదగ్గరకు తీసుకురండి. (రంగశాయిని భటులు తీసుకు పోతారు)

(తెరలో)

"కొండవీడు మనదేరా - కొండపల్లి మనదేరా
కాదని వాదుకు వ నే - కటకం దాకా మనదేరా !"

పాత్రుడు : ఏమిటా కోలాహలం ? ఎవరది ?

(భటుడు : చాకలితో ప్రవేశం)

చాకలి :

"కొండవీడు మనదేరా - కొండపల్లి మనదేరా !"

భటుడు : ప్రభూ ! ఈ చాకలి యీ పాట పాడుకుంటూ చెరువు గట్టుమీద బట్టలు వుతుకుతున్నాడు.

పాత్రుడు : ఎవ రీ చాకలి ?

భటుడు : ఎవరో పిచ్చివాడులా ఉన్నాడు. చాల రోజులనుంచి ఉదయ గిరిలో ఉన్నాడుట. ఇతన్ని చిన్నప్పటినుంచీ ఎరిగిన వా ళ్ళున్నారు ఈ వూళ్ళో. ఈతడు చెప్పే మాటలు కోటలుదాటి పోతున్నాయి.

పాత్రుడు : చాకలీ ! మీ దే వూరు ? నీ విప్పు డేం చేస్తున్నావు ?

చాకలి : మాది యిజయనగరం. రాయలవారి యింటి చాకల్ని.

పాత్రుడు : ఏ రాయలవారురా ?

చాకలి : శ్రీశ్రీశ్రీ కిట్టదేవరాయలుంగారు.

పాత్రుడు : (విరగబడి నవ్వి) వెనుకటి జన్మలోనా ? వచ్చే జన్మలోనా ? నాల్గు నెలలనుండి దుర్గద్వారాలు మూసేసి వుంచేము కదా ? ఏం నిషాలో వున్నా వేమిట్రా ?

చాకలి : సత్తెం బాబయ్యా ! నేను రాయలవారికి హమేషా ఇంజామర ఈస్తుండే వాణ్ణి.

పాత్రుడు : వీణ్ణి ఏమనాలో తెలియటం లేదు. ఓరీ చాకలీ ! రాయలవారు నిన్నిక్కడికి ఎవరికి ఏంజామర వీయమని పంపించారురా ?

చాకలి : అదే అర్థం కావటం లేదు. బాబయ్యా - అప్పుడు రాయలవారి గ్రుడ్లు తిమ్మరుసయ్యగారు పీకించేశారు. అక్కడుంటే నా తల కొట్టేస్తారు పొమ్మన్నారు. ఇదిలేక యీ సీమకు వచ్చేశాను.

పాత్రుడు : అదేమిటిరోయ్. అయితే మీ రాయలవారి గ్రుడ్లు పీకెయ్యటం నిజమేనా !

చాకలి : అయ్యా, అదే అర్థంకావటంలేదు. నేను కళ్ళారా రాయలవారి కళ్ళకు కట్టుకట్టి పచ్చి, పచ్చిగా ఉన్నప్పుడు చూశాను. తరువాత ఆరే పెబువు లయ్యారు అన్నారు. అంతా ఇంతగా వుంది.

పాత్రుడు : ఏమి టీ చాకలి వింత ధోరణీ .... వీళ్ళో గురించి ఏమైనా ఆచోకీ తీశారా ?

భటుడు : ప్రభూ ! నాల్గు నెలలనుంచీ వీడు ఈ మాటలే అందరితో చెపుతున్నాడట - పాపం ! ఆ రోజుల్లో అన్నం తినకుండా గంజి త్రాగకుండా ఏడ్చేవాడని ప్రక్క చాకలాళ్ళు చెపుతున్నారు. వీడికి రోజూ అవే కబుర్లట. మనకు దొరికిన భటులు చాలమంది వీడు రాయలవారిదగ్గ రున్నట్లు చెపుతున్నారు.

చాకలి : ఆయ్యా ! అమ్మ చాచ్చండి - నేను రాయలోరి చాకల్నే. అయ్యా నన్నొదిలి పెట్టండి. రాయలోరి దగ్గరకి పోతాను. ఇపుడు నన్నొదిలిపెడితే మీకు ముందు వుపకారం చేస్తాగా, నా మాటంచే రాయలవారికి రచ్చరే కనుకోండి.

పాత్రుడు : ఓరి వీణ్ణి తగలెయ్యా ! వీడు నాకు వుపకారం చేస్తాడుట - ఎప్పుడో - మా పెందుకు ఓరీ చాకలీ నీవు రాయలవారి మనిషి నని ఒప్పుకుంటున్నావు కదా ఇప్పుడు నీ తల తీయిస్తే ఎవర్రా అడ్డుకొనేది.

చాకలి : ఎవ రున్నారండి బాబయ్యా ! చంపడం ఒక చణ మనుకోండి. ఇక్కడ ఉండటంకంటె చావటం మంచిదే కాని నే విచారించేది మీ తల రాయలవారు తీసేటప్పుడు మిమ్మల్ని రచ్చించేందుకు

ఎవ రుంటారా అని. ఇప్పుడు నన్నొదిలేస్తే నే నుంటానుగా: బాబయ్యా మా రాయలవారి దగ్గరకు పోనివ్వండి.

పాత్రుడు : ఇక్కడ నాచేతిలో చిక్కికూడా వీడి కింత ధైర్యం ఎక్కడ నుండి వచ్చింది?

తిరుపతి : అజ్ఞానంవల్ల వచ్చే ధైర్యం విజ్ఞానంవల్ల రాదు. ఏముంది : పిచ్చి వెధవ. ఒనిలి పెడితే రాయల వా రీ ముష్టి చాకలి వెధవను గుర్తుకూడా పట్టలేక ఉదయగిరికోటలోనుండి వచ్చిన గూఢచారి అని ఉరితీయిస్తారు.

చాకలి : ఆ : రాయలోరా ఆయన సింహాసనం ఎక్కినప్పుడు తీరా ఇక్కడ వుండిపోయానుగాని...

పాత్రుడు : లేకపోతే నీ వొక దుర్గాధిపతివయ్యేవాడి వన్నమాట.

చాకలి : తప్పకుండా—ఈరోజుల్లో అడ్డమైనోళ్ళూ గొప్పోళ్లై పోతూంటే నేనుమట్టుకి కాకూడదా బాబయ్యా :

పాత్రుడు : సరే : వీడు వట్టి పిచ్చి వెధవ. వీణ్ణి వదిలెయ్యండి. కాని వీడి జాడలు కనిపెడుతూ వుండండి.

చాకలి : అద్దిర నా రాజా :

"కొండవీడు మనదేరా - కొండపల్లి మనదేరా :
కాదని వాదుకు వస్తే - కటకం దాకా మనదేరా :"

(నిష్క్రమణ)

భటుడు : (రంగాయి, మీనాక్షులతో ప్రవేశం) జయం జయం మహా రాజులకు - ఈ మీనాక్షమ్మ రంగాయిని చూడగానే ఈరేగింపుకు అడ్డంపడి ఏడుస్తూ అతన్ని కౌగిలించుకుంది.

పాత్రుడు : ఏం ? మీనాక్షీ : రంగాయికి నీకు చుట్టరికమేమైనా వున్నదా?

మీనాక్షి : లేదు.

పాత్రుడు : అంటే—ఏమైనా ఆచోకీ తీశావ్రా ?

భటుడు : ప్రభూ ! మీనాక్షికి రంగళాయికి ఏదో సంబంధం వుందిట.
అందుచే తలుపులు వేసివున్నా రాత్రి కోట గోడలు ఎగబ్రాకాడుట.

పాత్రుడు : మీనాక్షీ—నిజం చెప్పు.

మీనాక్షి : ప్రభూ ! నిజమే. నాకోసం ప్రాణానికి తెగించి వచ్చినట్లు
తెలిసి కుమిలిపోతున్నాను.

పాత్రుడు : నీఅంత అందమైన అమ్మాయి కోసం ప్రాణాలు తెగించిన
యీ యువకుడు ఎంత రసజ్ఞుడో కదా !

మీనాక్షి : మహారాజులుంగారి సహృదయత చెప్పుకోదగ్గది.

పాత్రుడు : కావచ్చు. కాని, ఈ ప్రణయగాథకు మరుగున రాజద్రోహం
కూడ మేలి ముసుగు వేసుకొని ఉన్నదేమోనని మా భయం.
మల్లూ ! రంగళాయిని ప్రక్కగదిలో బంధించి ఉంచండి ఈలోగా
మీనాక్షిని విచారిస్తాను.

(తిరుపతిమల్లు, భటుడు, రంగళాయి—నిష్క్రమణ)

పాత్రుడు : మీనాక్షి ! నీకు పెళ్ళయిందా ?

మీనాక్షి : లేదు.

పాత్రుడు : అయితే ఎంతకాలంనుంచి అతనికి నీకు ఈ సంబంధం ?

మీనాక్షి : వారు మా మామ కొడుకు. మా అత్తయ్యకు ఈ సంబంధం
ఇష్టంలేదు.

పాత్రుడు : బాగుంది. అందుకని యింత సాహసమా—పట్టుబడితే పుట్టె
వుండదని తెలియదా ?

మీనాక్షి : ఏదో కళ్ళు మూసుకుపోయాయి—ఇప్పుడు గోల పెడుతున్నారు.
వారి ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయి కదా—రక్షించాలి ప్రభూ !
ఇల్లాంటి విషయాల్లో ఎవరికైనా కళ్ళు మూసుకుపోతాయి. లేక
పోతే అంత గోడ ఎగబ్రాకటమే...

పాత్రుడు : మీనాక్షీ ! ఇదివరకు రంగళాయి అంత సాహసానికి ఒడిగట్టా
డంటే నాకు అర్థంకాలేదు. కాని నిన్ను చూచినతర్వాత అర్థమైంది.

ఇంత అందమైన అమ్మాయి ఉదయగిరిలో ఉన్నదని ఇదివరకు మాకు తెలియనే తెలియదే ?

మీనాక్షి : మా బావకూడా అట్లానే అనేవారు. ఎందుకీ అందం. తగ లెయ్యటానికి మా బావ లేకపోతే; ప్రభువులవారి గుండెకూడా ఎంత మెత నెనదో!

పాత్రుడు : బాగుంది—ప్రభువులుకూడా మనుష్యులే—నిన్ను చూస్తుంటే నా గుండె కరిగిపోతోంది. ఇన్నాళ్ళనుంచీ ఈ లావణ్యరాశి ఎందుకు మాకళ్ళ పడలేదా అని!

మీనాక్షి : అమ్మయ్య ఇప్పటికి నాకు మాబావ బ్రతుకుతారని ఆశ కలుగు తోంది. ప్రభువులవారి పాదాలు వదలను. రక్షించాలి, బావను కరుణించాలి. ఆ మాటంటేనే కాని కాళ్ళు వదలిపెట్టను.

పాత్రుడు : ఆగు! నిన్ను చూడగానే నా మనస్సు అదో విధంగా మారి పోయింది. రంగశాయే కాదు. ఏ మగవాడైనా సరే నీకోసం ప్రాణాలైనా లెక్కచేయడు.

మీనాక్షి : మహారాజులుంగారి మాటలు అర్థం కావటంలేదు. మన్నించాలి. మా బావతో సహగమనమైనా చేస్తాను. మాబావ లేని బ్రతుకు నాకెందుకు ? నాకోసం మా బావ ప్రాణా లర్పిస్తున్నాడే ! నేను మట్టుకు ప్రాణాలర్పించనక్కర్లేదా ?

పాత్రుడు : అతని ప్రాణాలు నీ చేతుల్లోనే ఉన్నాయి.

మీనాక్షి : ఆ ! నా చేతుల్లోనా ! నా చేతుల్లోనే ఉన్నాయా! అయితే అతన్ని బ్రతికించడానికి ఏమి చేయడానికైనా వెనుదీయను.

పాత్రుడు : ఆగు! ఆ మాటమీదే నిలు—మీనాక్షీ ! నిన్ను రంగశాయి కంటె ఎక్కువగా ప్రేమించాను. నమ్ము, నా ప్రాణాలుకూడా నీచేతుల్లోనే ఉన్నాయి—నా ప్రాణాలు నిలిపి, రంగశాయి ప్రాణాలు నిలుపు.

మీనాక్షి : ఆ ! ప్రభూ ! మీ కోరిక న్యాయమైనదికాదు. నా ప్రాణాలు కోరుకోండి. సంతోషంతో యిచ్చేస్తాను. నేను—మా బావను విడిచి...

పాత్రుడు : మీనాక్షీ ! ఏం మాట్లాడుతున్నావో ఆలోచించుకో ! అయితే నేటిరాత్రి రంగశాయి పుట్టె కపాలతోరణంలో చేరుతుంది. ప్రేమించిన పురుషులను తిరస్కరించడం, స్త్రీజాతిలో వుండే దుర్గుణం.

మీనాక్షి : అట్లా అనకండి మహాప్రభూ ! నేనెక్కడ ! మీరెక్కడ !

పాత్రుడు : ఆ అంతరం గుర్తించి మాట్లాడుతున్నావా ? ఆలోచించుకొని సమాధానం చెప్పు. తల వూపి సమ్మతిస్తావా ! రంగశాయి బ్రతుకు తాడు—తల త్రిప్పి నిరాకరిస్తావా ! రంగశాయి పుట్టె కపాల తోరణంలో చూస్తావు. నీకిపుడు రంగశాయిమీద అసూయకూడా వీర్పడింది.

మీనాక్షి : నాకు మీ ధోరణి అర్థమైంది. మా బావతో సాయంకాలం సహగమనం చేస్తాను. సుఖంగా స్వర్గలోకంలో కలసి ఉంటాము.

పాత్రుడు : మీనాక్షీ ! ఆలోచించి మాట్లాడటం లేదు. ఆగు ! రంగశాయిని పిలిపిస్తాను. ఆతనితోకూడా ఆలోచించు ...(గంట మ్రోగిస్తాడు.)

(రంగశాయి - భటుడు ప్రవేశం)

మీనాక్షి : బావా ! బావా ! (రంగశాయిని కౌగిలించుకొని ఏడుస్తుంది)

పాత్రుడు : మీనాక్షీ ! రంగశాయి చావు బ్రతుకులు నీ అరచేతిలో వున్నాయి. బాగా ఆలోచించు - వస్తాను. (నిష్క్రమణ)

రంగశాయి : నా చావు బ్రతుకులు నీ అరచేతిలో వున్నాయా !—నేను బ్రతకడానికి వీలున్నదా ?

మీనాక్షి : ఏముంది !— మహారాజు క్రూరంగా మాట్లాడుతున్నాడు. అతనికి దుర్బుద్ధి పుట్టింది. మగవాళ్ళు, మహారాజులుకూడా ఇంత చపలచిత్తులయితే ఎట్లాగా !

రంగళాయి : అవును. ఏ మగవాడికైనా ఆ బుద్ధి పుట్టడంలో ఆశ్చర్యం లేదు. మహారాజూ మనిషే.

మీనాక్షి : ఆయనా ఆ మాటే అన్నారు.

రంగళాయి : అంటే నీ వేమన్నావు ?

మీనాక్షి : ఏమన్నాను ? ఏమనాలి ? మీతో సాయంకాలం సహగమనం చేస్తాను...కాని....

రంగళాయి : అంటే ! మీనాక్షీ ! సాయంకాలం నా తల నరికేస్తారా ?

మీనాక్షి : అవును స్పష్టంగా చెప్పాడు.

రంగళాయి : అయితే - నేను బ్రతకటం నీ కిష్టం లే దన్నమాట.

మీనాక్షి : నాకూ బ్రతకాలని లేదు. హాయిగా స్వర్గలోకంలో మన మిద్దరం కలసి ఉందాము.

రంగళాయి : మీనాక్షీ ! నిజం చెపుతున్నాను విను. నాకు బ్రతకాలని వుంది - నీకు బ్రతకాలని లేదూ !

మీనాక్షి : ఎందుకు ? మానం పోయిన తర్వాత స్త్రీకి ప్రాణా లెందుకు ?

రంగళాయి : అట్లా అనకు - చావుకు స్త్రీలు తెగించినంత త్వరగా పురుషులు తెగించలేరు. మీనాక్షీ ! ఒక్కమాట - నాకు ప్రాణ భిక్ష పెట్టమని నిన్ను ప్రార్థిస్తున్నాను.

మీనాక్షి : మీకోసం ఏమైనా చేస్తాను. కాని మానహాని జరిగిన తర్వాత నాకు మీకు భార్యగా వుండే అర్హత పోతుంది.

రంగళాయి : నా కిష్టమైనపుడు నీకేం ? పతివ్రత భర్త మాట వినితీరాలి.

మీనాక్షి : అమ్మో ! నాకు మిమ్మల్ని చూస్తే భయం వేస్తోంది. నేను మహారాజులుంగారికి లొంగిపోతే తర్వాత మీ మొగం చూచినపుడల్లా నేరం చేసినట్లు కుమిలిపోవలసి వస్తుంది. అమ్మో ! అదీగాక ఎందుకు నరరాక్షసు లుండే ఈ పాడు భూలోకంలో మనం బ్రదికివుండటం ?

రంగళాయి : మీనాక్షీ! సూటిగా చెప్పు! నేను బ్రతకటం నీకిష్టం లేదా?

మీనాక్షి : అయ్యో! దైవమా! మీకీ బుద్ధి ఎందుకు పుట్టాలి. ఆ మహా రాజుతో కలసి ఉండటానికి నా మనస్సు సుతరాం ఇష్టపడటం లేదు.

రంగళాయి : మనస్సు నామీదే ఉంచి-నాకోసం శరీరం ఆతని కర్పించు. నాకోసం-తెలిసిందా-మీనాక్షీ-ఆలోచించు-ఒక ప్రాణాన్ని రక్షించ టానికి ఏం చేసినా పాపం లేదు.

మీనాక్షి: ఒక ప్రాణ మేమిటి! మీ ప్రాణం, నా ప్రాణం కాదా?

పాత్రుడు : (ప్రవేశిస్తూ) ఏం మీనాక్షీ?

రంగళాయి: ఏం! మీనాక్షీ! అదుగో-భటులు నన్ను తీసుకుపోతారు-ఏం! మాట్లాడవేం?

మీనాక్షి : (రంగళాయిని కౌగిలించుకొని) సరే-నా పాతివ్రత్యాన్ని మీ ప్రాణంకోసం బలి ఇస్తాను.

రంగళాయి : అమ్మయ్య బ్రతికాను.

పాత్రుడు : ఏం! మీనాక్షీ! ఇప్పటికైనా ఒప్పుకున్నావా?

మీనాక్షి : మా బావను విడిచిపెడతారా?

పాత్రుడు : ఇంతేనా—యిక నీ వేది చేయమన్నా అది జరిగిందనుకో.

మీనాక్షి: మా బావను ఎప్పుడు విడిచిపెడతారు?

పాత్రుడు : తెల్లవారగానే యిద్దరూ కలిసి యింటికే వెళ్ళవచ్చు—మళ్లూ ఈమెను అంతఃపురం చేర్పించు—తెల్లవారేవరకూ రంగళాయిని బంధించివుంచు.

(నిష్క్రమణము)

[తెర]

★

శ్రీకృష్ణదేవరాయలు

అయిదవరంగము

[స్థలం : ఉదయగిరిదుర్గం]

(ప్రహరేశ్వరపాత్రుడు ఆలోచనానిమగ్నుడై వుంటాడు - ప్రక్కన దళవాయి తిరుపతిమల్లు)

మల్లు : ప్రభూ ! నాల్గు నెలలు ముట్టడించినా ఉదయగిరి వశంకాకపోవటంచేత ఇక శ్రీకృష్ణరాయలవారే స్వయంగా బయలుదేరుతారని మన వేగులవాండ్రు చెపుతున్నారు.

పాత్రుడు : ఆ ! రాయలే బయలుదేరుతాడా !

మీనాక్షి : (ప్రవేశం) ప్రభూ !

పాత్రుడు : ఎవరది ?

మీనాక్షి : ప్రభూ ! నా మాట మరచినట్లున్నారు.

పాత్రుడు : (మౌనం)

మీనాక్షి : ప్రభూ ! మాట్లాడరేం !

పాత్రుడు : ఏమిటి మీనాక్షీ ! నీ కీ చనువు ఎవరిచ్చారు? నేను ఉదయగిరి సీమకు ప్రభువును. కటకం చక్రవర్తి వీరభద్ర గజపతి పినతండ్రి ప్రహరేశ్వరపాత్రుల ప్రభువులవారిననే మాట మరచిపోకు. ఇక్కడకు ఎందుకు వచ్చావు? అంతఃపురంలో వుండక—

మీనాక్షి : అదేమి ప్రభూ ! ఉదయమే మా బావదగ్గరకు...

పాత్రుడు : బావదగ్గరకా ? హృదయం ఒకరికి అర్పించి, శరీరం ఇంకొకరికి వప్పగించడం స్త్రీజాతిలో వుండే నీచత్వం...

మీనాక్షి : నిజమే. మీ కోరిక నెఱవేరింది కదా ! ఇప్పుడు మీ రేమన్నా పడవలసిందే. మా బావదగ్గరకు పోనివ్వండి.

పాత్రుడు : బావ ! బావ ! (గంట మ్రోగించును)

భటుడు : (ప్రవేశం) జయం, జయం. ఏలినవారికి....

పాత్రుడు : రంగశాయిని తీసుకొనిరా ।

మల్లు : ఆదేమిటి ప్రభూ । మీ ఆజ్ఞ చొప్పున నిన్నరాత్రి అతని పుట్టె కపాలతోరణంలో చేరిందే ।

(భటుడు నిష్క్రమణ)

మీనాక్షి : ఆ । కపాలతోరణంలో చేరిందా ।— కపాలతోరణమే....

పాత్రుడు : మీనాక్షీ । విన్నావు కదా । జరిగిందేదో జరిగింది. దీనివల్ల నీ పాతివ్రత్యంకూడ భంగం కాదు. ఇదివరకు నాకు శరీరం అర్పించినట్లే మనస్సుకూడా అర్పించు. ఎవతె మనశ్శరీరాలను ఒకనికే అర్పిస్తుందో ఆమే పతివ్రత.

మీనాక్షి : ఎంత కుట్ర - ఎంత మోసం ? అంతా యిప్పుడు తెలుసుకో కలిగాను. పాపం. మా బావ నా పాతివ్రత్యాన్ని బలి ఇచ్చి తాను బ్రతకా లనుకొన్నాడు. ప్రభూ । దేవుడుంటే మహారాజులకైనా శిక్ష తప్పుతుందా ? మీరు మా బావను రక్షిస్తానని వాగ్దానం చేయలేదూ ।

పాత్రుడు : నీవు సమ్మతించావనే సంతోషంలో నేను అతని తల నరక వద్దని కబురంపడం మరచిపోయాను.

మీనాక్షి : నేను ముందరే మా బావను వదల మని ప్రార్థించాను.

పాత్రుడు : నేను నిన్ను ప్రేమించానా ? మీ బావనా ? నీకోసమే, నీమీద ఉండే ప్రేమచేతనే నీ అందాన్ని వలచే అతన్ని చంపించివేశాను. అతనిమీద నా కేమీ ద్వేషం లేదు. పైగా అతడు గూఢచారి కాదని బుజువైంది.

మీనాక్షి : బాగుంది. అయితే మా బావ చావుకు నా పాడు అందమే కారణ మన్నమాట.

పాత్రుడు : నిజం అంతే ।

భటుడు : (ప్రవేశం) ప్రభూ ! ప్రభూ ! శ్రీకృష్ణదేవరాయలవారే స్వయంగా సేనాధిపత్యం వహించి యుద్ధం ఆరంభించారు.

(నిష్క్రమణ)

పాత్రుడు : ఆ ! రాయలే స్వయంగా వస్తున్నాడా ?

మీనాక్షి : ప్రభూ ! మా బావ మొండెంతో సహగమనం చేస్తాను. దయతో...

పాత్రుడు : మీనాక్షీ ! నీకా అర్హత పోయింది. ఇంకొకరి కర్పించిన మైల దేహంతో సహగమనమా ? అతని ఆంతరాత్మ క్షోభించి పోతుంది.

భటుడు : (ప్రవేశించి) మహారాజా ! శ్రీకృష్ణదేవరాయలు మొదటి ప్రాకారాన్ని ఛేదించి దుర్గాన్ని ప్రవేశించారు. మన సేనలు చెల్లా చెదరై పారిపోతున్నాయి.

(తెరలో శతఘ్నిరావాలు)

పాత్రుడు : ఆ ! అయితే ! మన దండనాథులు ఏ మంటున్నారు ?

భటుడు : యుద్ధం లాభం లేదని చెప్పమన్నారు. అదీగాక ఈవేళ తమ శిరస్సు ఖండించి తన్ని స్నానం చేసినగాని ఆహారం స్వీకరింప నని శ్రీకృష్ణదేవరాయలవారు ప్రతిజ్ఞ చేశారుట. (నిష్క్రమణ)

పాత్రుడు : ఆ ! ప్రతిజ్ఞే ! (తెరలో శతఘ్నిరావాలు) – (కంగారుగా ముందుకు వెళ్ళబోతూ) ఏం ! మీనాక్షీ ! ఇంకా ఇక్కడున్నావేం-వెళ్ళు !

మీనాక్షి : కలియుగంలో ఈ జన్మలో చేసిన పాపం, ఈ జన్మలోనే అనుభవిస్తారు. మా బావ పుట్టె తీయించినట్లే రాయలవారు మీ పుట్టె కూడా తీయించే క్షణం త్వరలోనే వస్తుంది, జాగ్రత్త. (నిష్క్రమణ)

పాత్రుడు : (సింహాసనంలో కూలబడును) మల్లా ! ఇక మనకు గత్యంతరం ! పోనీ సంధికి రాయబారిని పంపిస్తే ?

మల్లు : రాయబారి తల నరికి బళ్ళానికి గ్రుచ్చి పాతటం రాయలవారికి ఆచార మన్నారు.

పాత్రుడు : పోనీ ! రాయలవారి చాకలి శాయిని పంపితే ! ఎవరురా !

(భటుడు ప్రవేశం) శాయిని తీసుకొనిరా ! (భటుడు నిష్క్రమణ)

మల్లు : రాయబారానికి పిచ్చివెధన - చాకలా ! రాయలవారికి ఇష్టులైనవా రెవరైనా దొరకితే...

పాత్రుడు : అవును—రాయలవారికి ఎవరు ఇష్టులు ? ఆ-రాయలకు కవులంటే ఇష్టం. మనచుట్టూ తెనాలికవి లామలింగం చాలా రోజులనుంచి తిరుగుతున్నాడు. అతన్ని పట్టుకొనివస్తే బాగుంటుంది. రాయలు కవి తలకాయ నరకలేరు గదా !

మల్లు : బాగుంది. మీ ఊహ ! క్షణంలో తెప్పిస్తాను. (నిష్క్రమణ)

(భటుడు-చాకలితో ప్రవేశం)

చాకలి: "కొండవీడు మనదేరా-కొండపల్లె మనదేరా
కాదని వాదుకు వస్తే-కటకం దాకా మనదేరా !

పాత్రుడు : చాకలీ ! చూశావా నీతలకాయ తీసివెయ్యకుండా వదలిపెట్టాను !

చాకలి : అందుకనేగా-నానుగూడ వచ్చింది. మా కిట్టరాయలోరు మొదటి పాకారం దాటి రెండవదాని దగ్గర వున్నారుటగా ?

పాత్రుడు : ఆ ! చూడు ! రాయలవారికి కవు లంటే ఇష్ట మటగా ?

చాకలి : ఇట్టం ! కవులంటే పడిచస్తారు. అంతేకాదు. సంగీతం అంటే చెవికోసుకొంటారు. ఇక అందమైన ఏబొమ్మో, ఇగ్రహమో కనిపిస్తే ఆవేళ అన్నంగూడ అక్కరలేదు.

పాత్రుడు : ఒకవేళ ఉదయగిరికోట పడిపోతే నా తల తీసెయ్యరు గదా !

చాకలి : ఏమో ! ఆయన గుండె వెన్నపూస - ప్రక్కన తిమ్మరుసయ్య ఉంటే ఏమో గాని లేకపోతే - నే చెబితే చాలు - ఆయనకండీ ఒక పద్యం చెప్పలేరూ ? రాగానే—"స్వాగతము నీకిదె మహా భాగా రాజాధిరాజ పరమేశ్వరుడా" అని...

పాత్రుడు : నాకు కవిత్వం రాదే-నీ కేదో అబ్బినట్లుందే ;

చాకలి : ఏదో భోజరాజు కతలు చెపుతారు గాని కిట్టరాయలోరి మొగం చూస్తే చాకలాడైనా అంతో యింతో కయిత్తం చెప్పి తీరుతా డండి. పోసీ కైయిత్తమే అక్కరలేదు. ఈ కోటలో బాలమురళీ యిగ్రహం చూస్తే రాయలు మురిసిపోతా రసుకోంది.

[మల్లా-రామలింగం ప్రవేశం....భటుడు తెల్లజెండా యిచ్చి వెడతాడు]

రామ : జయం, జయం ప్రభువులవారికి.

పాత్రుడు : కవిగారూ ! మీతో ఒక చిన్న పని వచ్చింది. మీరు ఏలాగా కృష్ణరాయలను చూడాలనుకుంటున్నారుగదా! కవులంటే ఆయనకు చాలా ఇష్టమూ, గౌరవమూ ! మీరు యీ చిన్న సహాయం చేయా లని ప్రార్థిస్తున్నాను. మీరు తెల్ల జెండా పట్టుకొని రాయబారిగా వెళ్ళాలి. మీరు చాలా గొప్ప కవి అని విన్నాను. మీకు తగిన బహుమానం...

చాకలి : (నవ్వి) రాయబారానికి యీ పిరికి బాపనయ్యా ! మంచోడు దొరకేడ మహా మంచోడు దొరకేడు.

పాత్రుడు : అబ్బే ! పిరికితనానికేం - చాల గొప్ప కవులట ! అందరూ చెప్పుకుంటున్నారు.

చాకలి : ఈయన కయిత్తం నేను వినలేదా ! ఈయన గొప్పతనం మీ దగ్గరే తేల్చేస్తాను. ఈ సమస్య పూరించమనండి...

"కుంజరయూథమ్ము దోమ కుత్తుక జొచ్చెన్"...

రామ : ప్రభూ ! నే నెప్పుడూ యుద్ధభూమికి వెళ్ళలేదే ?

పాత్రుడు : పోసీ ! ఈ చాకలి కూడ మీ వెంట వస్తాడండి కవిగారూ !

చాకలి : ఈ సమస్య పూర్తి చేస్తేనే గాని యితన్ని నా వెంట తీసుకు వెళ్ళను.

పాత్రుడు : పోసీ ! సమస్య పూరించండి బాబూ ! కవిగారూ ! ఇప్పుడు ఈ చాకలి వెధవను శిఖండిగా పెట్టుకుంటేనే కాని, నాకు....

రామ : అయితే చాకలీ విను...

"గంజాయి త్రాగి తురకల
సంజాతుల గూడి కల్లు చవిగొన్నావా ।
లంజాకొడకా ఎక్కడ
కుంజరయూధంబు దోమ కుత్తుక జొచ్చెన్."

చాకలి : ఛీ: ఛీ। నన్నింత మాటే। రాయలోరి చాకలికి ఇంత పరాబవమే. ఛీ। ఈ కవిగాణ్ణి నా వెంట తీసుకువెళ్ళను.

రామ : ఈ చాకలివానికి. యింత గీర్వాణం ఏమిటి। వీడితో నే వెడతానా। (నిష్క్రమణ)

పాత్రు : అయితే చాకలీ। ఇదిగో-తెల్ల జండా- నీవే వెళ్ళాలి. (తెల్ల జెండా యిచ్చును)

భటుడు : (ప్రవేశం) ప్రభూ। ప్రభూ। (తెరలో కోలాహలం-శతఘ్ని రావాలు) కృ....కృ....కృష్ణదేవరాయలు.....

వంది, మాగధులు : (లోపలనుంచి) మూరురాయరగండ, పరగండ భైరవ, రాజపరమేశ్వర శ్రీ శ్రీ శ్రీ వీరకృష్ణరాయభూపాలా విజయీభవ। దిగ్విజయీభవ। విజయీభవ। దిగ్విజయీభవ। విజయీభవ। దిగ్విజయీభవ।

(ఆంగరక్షకులతో శ్రీకృష్ణదేవరాయలు ప్రవేశం.... వెనువెంట పెద్దన, ధూర్జటి, భటులు)

పాత్రు : జయము, జయము సాహితీసమరాంగణసార్వభౌమ శ్రీకృష్ణదేవరాయ ప్రభువులవారికి- శరణాగతి మన్నింప ప్రార్థన.

శ్రీకృష్ణ : మహామండలేశ్వరా।

పాత్రుడు : దాసానుదాసుని శరణాగతత్రాత బిరుదాంకితులైన చక్రవర్తి రక్షించాలని విన్నవించుకొనుచున్నాను.

శ్రీకృష్ణ : లేవండి.

పాత్రుడు : ధన్యోస్మి। (లేచును)

చాకలి : ప్రభువులవారి సందర్శనంకోసం "స్వాతివానకు ముత్తెపు చిప్పలవలె" ఈ సీమ ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

శ్రీకృష్ణ : శాయీ ! గుడ్డ లుతకటం మానేసి కవిత్వం చెప్పటంలేదుకదా?

చాకలి : ఏదో ! వెట్టి మొట్టి పాట పాడుకుంటూ గుడ్డ లుతుక్కుంటూ ఊరంతా తిరుగుతున్నాను.

"కొండవీడు మనదేరా - కొండపల్లె మనదేరా !
కాదని వాదుకు వస్తే - కటకం దాకా మనదేరా !"

శ్రీకృష్ణ : వాదుకు వస్తే అంతే- వాదుకు రాకపోతే.....

చాకలి : రాకపోయినా అంతే... ఇదిగో సువ్వీ తెల్లజెండా పుచ్చుకో. నా యింజామరం నా కియ్యి.

శ్రీకృష్ణ : వింజామర శాయికియ్యి...(శాయి వింజామర తీసుకుంటాడు. తెల్ల జెండా యిచ్చేస్తాడు)

చాకలి : ప్రభులవోరు చల్లగుండాలి.... ఎన్నాళ్ళకు కన్నులు చల్లంగా తిరిగి కొలువు చేరుకోగలిగాను !

శ్రీకృష్ణ : ఉదయగిరీశ్వరులు ! మా ప్రతిజ్ఞ విన్నారుకదా !

పాత్రుడు : విన్నాను. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా ? ప్రభూ ! నేను శరణా గతుణ్ణి - తమతో యుద్ధంచాలించి దుర్గద్వారాలు తెరపించాను...

శ్రీకృష్ణ : ఏం - ద్వారాలు తెరచి మాకు ఉపకారం చేశారా ?

పాత్రుడు : అపచారం, అపచారం - మాకే వుపకారం చేసుకున్నాము. తమపాదాక్రాంతుడైన రాజకుమారుని రక్షించి రాయలు చిరకీర్తి పొందగలరు.

శ్రీకృష్ణ : నిజమే. ఆటు ప్రతిజ్ఞ, ఇటు శరణాగతుడు; ఆంధ్రకవితా పితామహా ! ఇపుడేమి చేయాలి... శరణాగతుణ్ణిగూర్చి మన శాస్త్రాలు ఏమి విధించాయి ?

పెద్దన : మహారాజా ! మహాభారతం - పంచమవేదం - అందులో—

"శరణం బని వచ్చిన భీ
కరశత్రునైన ప్రీతి కావగ వలయున్
కరుణాపరుల తెరం గిది
ఇరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్."

పాత్రుడు : ఆహాహా!!

శ్రీకృష్ణ : ధూర్జటి కవీంద్రా!— తమ రే మంటారు?

తిమ్మరుసు : (ప్రవేశిస్తూ) ఏమంటారు! శత్రుశేషం, అగ్నిశేషం మిగల్చరాదు (కూర్చుంటాడు).

శ్రీకృష్ణ : ధూర్జటి కవీంద్రా! తమ అభిప్రాయం...

ధూర్జటి : ప్రతిజ్ఞ పాలించాలి - శరణాగతుని రక్షించాలి - రెండూ జరగాలి. తిమ్మరుసు మంత్రిశేఖరులే ఏదో ఉపాయం, ఉభయ తారకంగా ఉపదేశించాలి...

శ్రీకృష్ణ : అప్పాజీ! మీదే తుదినిర్ణయం...

తిమ్మరుసు : బాగున్నది, ప్రహారేశ్వరపాత్రులు శరణాగతుడు.

పాత్రుడు : శరణాగతుడను - పాదాక్రాంతుడను - శ్రీ వీరప్రతాప శ్రీకృష్ణరాయ కింకరుడను...

తిమ్మరుసు : నిజమే. ఆ విధముగా భావిలోకూడ...

పాత్రుడు : ప్రాణభిక్షపెట్టిన శ్రీకృష్ణదేవరాయలవారిదే యీ శరీరం...

తిమ్మరుసు : ప్రతిజ్ఞాపాలన చక్రవర్తికి ప్రథమకర్తవ్యం....

పాత్రుడు : ఆఁ! మహామంత్రీ!...

తిమ్మరుసు : రుద్రదేవగజపతీ! శ్రీకృష్ణరాయలవారి పాదపీఠికపై తమ శిరస్సుకు బదులు కిరీటం సమర్పించవలెను.

పాత్రుడు : సంతోషంతో నా కిరీటం భుజకీర్తులు రాజలాంఛనాలు చక్రవర్తి పాదపీఠికపై సమర్పిస్తాను.

తిమ్మరుసు : రాయలవారు కిరీట తాడనంతో ప్రతిజ్ఞ నెరవేర్చుకోగలరని నా మనవి....

శ్రీకృష్ణ : సంతోషం...అట్లే జరుగుగాక !

తిమ్మరుసు : ఉదయగిరీశ్వరులు ! కిరీట భుజకీర్తులు సర్వరాజలాంఛ
నాలతో యథోచితపూజోపహారాలతో వచ్చి, కప్పం చెల్లించ
వలెను. అంతవరకూ ప్రభువులు కొలువు తీర్చి ఉంటారు....

పాత్రుడు : శెలవు...

(వంగి నమస్కరించి, ఇద్దరు భటులతో నిష్క్రమణ)

శ్రీకృష్ణ : మనకోసం, తెనాలినుంచి రామలింగకవి వస్తూ మధ్య ఇక్కడ
చిక్కు పడి పోయారని విన్నాము.

భటుడు : ద్వారంవద్ద వేచివున్నారు ప్రభూ !

శ్రీకృష్ణ : వెంటనే ప్రవేశపెట్టు

భటుడు : చిత్తం.

చాకలి : రామలింగకవా !

శ్రీకృష్ణ : ఏం ?...

చాకలి : అతన్ని తమవద్దకు తెల్ల జెండా ఎత్తమంటే, బాపనయ్య భయ
పడి పారిపోయాడు...

శ్రీకృష్ణ : ఇంతే కదా !

చాకలి : అంతే కాదు. ప్రభువులవారు చిత్తగించాలి. నేనొక సమస్య
యిస్తే తిట్టి, తిట్టి, దులిపి, దులిపి వదలి పెట్టాడు.

తిమ్మరుసు : ఏండా ! నువ్వుకూడా సమస్య యిచ్చావు. ఏం సమస్యరా?

చాకలి :

"కుంజరయూథమ్ము దోమ కుత్తుక జొచ్చెన్"

శ్రీకృష్ణ : బాగుందే. పూర్తి చేశాడా !

చాకలి : చేశారు.

తిమ్మరుసు : ఏదీ - చదువు.

చాకలి : అబ్బే నాకు సిగ్గుచేటు...

శ్రీకృష్ణ : పరవాలేదు చదువు....

తిమ్మరుసు : ఊఁ...

చాకలి :

"గంజాయి త్రాగి తురకల
సంజాతుల గూడి కల్లు చవి గొన్నావా :
లంజా కొడకా ఎక్కడ
కుంజరయూథంబు దోమ కుత్తుక జొచ్చెన్."

శ్రీకృష్ణ : (విరగబడి నవ్వి) బాగుంది. బలే కవీశ్వరుడే :

రామ : (ప్రవేశం) జయం, జయం, ప్రభువులకు...

తిమ్మరుసు : కవిగారూ : మాకు స్వస్తిపద్యాలు, ముఖస్తుతి పద్యాలు కాదు కావలసింది. ఒక సమస్య యిస్తాం పూరించండి.

రామ : చిత్తం....

తిమ్మరుసు :

"కుంజరయూథంబు దోమ కుత్తుక జొచ్చెన్."

చాకలి :

"ఉత్తుత్తి నత్తిగుత్తుల—
క్రొత్త వెలగ పండొక కవి కుత్తుకజొచ్చెన్."

తిమ్మరుసు : కానివ్వండి...

శ్రీకృష్ణ : (నవ్వి) కానివ్వండి - కవిగారూ :

రామ :

"రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటు గొల్వ పాల్పడి రకటా :
సంజయ : విధి నే మందును
కుంజరయూథంబు దోమ కుత్తుక జొచ్చెఁ."

శ్రీకృష్ణ : సెభాష్ : మహాకవీ : ఇదుగో : ముత్యాలహారం....(ముత్యాల హారం ఇచ్చును)

రామ: (కన్నుల కద్దుకొని) మహాప్రసాదం - నేడు నా జీవితం ధన్యమైంది.

"ఎందరు రాజు లీపృథివి నేలిరొ యింతకుముంద రందరుగ
బ్రుందిరి చీకటిగ సుకవిమండలి వాఙ్మయమందిరమ్ములగ
కుందవధూపుటీతుహినకోమలకీర్తి సదా చరిత్రలో
నుందువు సాహితీప్రియమహోదయ నీవె నృసింహానందనా!"

పెద్దన: ఈ కవి వయస్సున పిన్నవాడైనా - కవితలో పెద్ద...

రామ: ఆంధ్రకవితాపితామహుని ఆశీస్సులందిన నేను ధన్యుడను...

శ్రీకృష్ణ: రామలింగకవీశ్వరా! మా ఆస్థానంలో అష్టదిగ్గజాలైన ఆంధ్ర కవీశ్వరు లుండాలని మా ఊహ. ఆంధ్రకవితాపితామహుడు, అల్లసానిపెద్దన, నంధితిమ్మన, ధూర్జటి మహాకవుల సరసన తెనాలిరామలింగంకూడ ఒక కవికుంజరమై ఉండుగాక.

రామ: శ్రీకృష్ణదేవరాయలవారి కృపకు సర్వదా కృతజ్ఞుణి...

"సరసుండై నను మెచ్చియిచ్చె
నిపు డీ సాహిత్యసమ్రాట్టు కుం
జరపీఠంబును నేడు,
ఆంధ్రకవితాచార్యుండు పెద్దన్నతో
సరసగ కూర్చునుచుంటి నే
భయముతో, క్షంతవ్యుడగ మూరురా
యరగండా పరగండభైరవ
విశాలాంధ్రక్షమాధీశ్వరా!"

శ్రీకృష్ణ: ఆంధ్రకవితాపితామహుల్ని మెప్పించిన ఒక కవికుమారుడు మన తొలి దిగ్విజయయాత్రలోనే లభించడం మాకు పరమ సంతోషం....

పెద్దన: ఆంధ్రభోజులు ఎక్కడ చేరిన అక్కడే కవులు ఉద్భవిస్తారు.

రామ : ఆంధ్రకవితాపితామహుల కవితామృతం గ్రోలాలని యీ ఉదయ
గిరి ఉవ్విళ్ళూరుచున్నది.

శ్రీకృష్ణ : బాగు. పెద్దనకవీశ్వరులు సహజకోమలకంఠంతో ఒక కమ్మని
గీతం ఆలపింప ప్రార్థన...

తిమ్మరుసు : ప్రభువులవారికి దిగ్విజయయాత్రమీదకంటె కవిత్వంమీదే
ఎక్కువ ప్రీతి అనుకుంటాను.

పెద్దన : మంత్రిశేఖరులు మనోజ్ఞంగా సెలవిచ్చినారు - ఆదీగాక...

"నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన మయ్యెల మంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకిన గాక యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే!"

రామ : సార్వభౌముల కొలువులో, కవిసార్వభౌము లున్నారు...

శ్రీకృష్ణ : అప్పాజీ! ఆంధ్రకవితాపితామహులు ఇల్లు చేరగానే వారి
కోరికలన్నీ భూతార్థములగు గాక!

పెద్దన : ప్రభువులకు మా అభివాదాలు.

పాత్రుడు : (ప్రవేశం. కిరీట భుజకీర్తులతో) మహాప్రభూ! కర్ణాట
చక్రవర్తీ! దాసానుదాసుడు ప్రహరేశ్వరపాత్రుడు, నతమస్తకుడై,
పాదాక్రాంతుడై శరణు వేడుచున్నాడు... (కానుకలు అందించు
చుండును)

వంది :

"అవిరళ వితరణవిద్యా
నవరాధేయునకు సజ్జనవిధేయునకున్
గవితాస్త్రీలోలునకున్
ఖవిటంకనటద్యశోధి కల్లోలునకున్."

మాగధులు :

"దిగభీకా సహ్యాధగ
ద్ధగితేద్ధరుచి ప్రతాప తపన స్ఫురణ
స్థగితద్యుమణీకి నిమిషా
ర్ధ గృహీత కళింగరాజ తనయాగ్రణీకిన్."

పాత్రుడు : ప్రభువులవా రీ బాలమురళీవిగ్రహం ఉపహారంగా స్వీకరింప ప్రార్థన... (విగ్రహం యిచ్చి, కిరీటమును రాయల పాదముల దగ్గర ఉంచును)

తిమ్మరుసు : మంచిది. ఇక ప్రభువులవారు కిరీటతాడనముచే ప్రతిజ్ఞా పాలన మొనరింప ప్రార్థన...

శ్రీకృష్ణ : (కిరీటమును తన్నును)

తిమ్మరుసు : ఈ కిరీటమును వంది మాగధులు పంచుకొందురు గాక!

(వంది మాగధులు కిరీటాన్ని తీసుకుంటారు)

శ్రీకృష్ణ : ఉదయగిరీశులు ఇకమీద మా యెడ జాగ్రత్తగా ప్రవర్తింప వలసి యుండును. మిమ్మ హృదయపూర్వకముగా క్షమించి నాము.

మీనాక్షి : (ప్రవేశం) ప్రభూ! ఈ పాత్రుడు క్షమాపాత్రుడు గాడు. మహా ప్రభూ! ఘూ బావ పుట్టెను నరికించి కపాలతోరణంలో కెక్కించి నట్లు ప్రభువులు ఈ మహాపాపి శిరస్సు ఖండిస్తారని ఆశించి వేచియున్నానే!

శ్రీకృష్ణ : ఎవరీ అమ్మాయి? ఆగమ్మా! ఈమె వృత్తాంతం విచిత్రంగా వున్నదే. విపరిస్తారా ఉదయగిరీశ్వరులు.

పాత్రుడు : నిజమే. ఒక యువకుడు - ప్రేమోన్మాది. ఒక రాత్రి దుర్గ ప్రాకారం ఎగబ్రాకుతూ పట్టుబడ్డాడు. అతనికి సాధారణ శిక్ష అదే....

శ్రీకృష్ణ : ఏమమ్మా !

మీనాక్షి : ఓడిపోయిన, మహారాజులుంగారు అసలు విషయం దాచిపేసి చెప్పటం లేదు. (ఏడుస్తూ పాదాలమీద వ్రాలును).

శ్రీకృష్ణ : అయితే నీవే చెప్పు తల్లీ ! ఈ అమ్మాయి ఏడ్పు హృదయ విదారకంగా వుంది. నా గుండె స్నాయువులన్నీ ఉచమట్టుగా కదలి కంపిస్తున్నాయి. లే అమ్మా! లే-చెప్పమ్మా! భయం లేదు.

మీనాక్షి : [లేచి] నాకు నోరు రావటం లేదు. మహాప్రభూ ! ఒక్క-రోజు ముందు మహాప్రభువులవారి పాదాలు పుచ్చుకొనే అదృష్టం నాకు పట్టి వుండలేదు.

శ్రీకృష్ణ : చెప్పమ్మా ! తల్లీ ! నీకు న్యాయం చేస్తాము. ఏమీ విచారించ వద్దు.

తిమ్మరుసు : ప్రభువులు కరుణించారు. అనవసరంగా దుఃఖించకు - చెప్పు...

మీనాక్షి : మా బావ నాకోసమే అంత సాహసానికి వడి గట్టాడు. చివరకు ఈ మహారాజు...

తిమ్మ : ప్రహరేశ్వరపాత్రులవారేనా.

మీనాక్షి : ఔను...మా బావను వదలిపెట్టడానికి - నన్ను బెదరించి నిర్బంధించారు - బావమాట త్రోసివేయలేక - విధిలేక లొంగి పోయాను .. (ఏడుస్తుంది.)

శ్రీకృష్ణ : ఏది మీ బావ ? ఎక్కడున్నాడు ?...

మీనాక్షి : (ఏడుస్తూ) ఎక్కడున్నాడు ! అతని తల కపాలతోరణంలో చేరిందనేగా మనవి చేసుకున్నాను. నేను వీరికి లొంగిపోయాను. ఈ అపవిత్రదేహం సహగమనమునకుకూడ పనికిరాదు...

తిమ్మరుసు: ఈ అమ్మాయి చెప్పేకథ నిజమేనా !...

శ్రీకృష్ణ : ఆ ! అమ్మాయి కన్నులనుండి కారిన కన్నీటి బిందువులు సహస్రకంఠాలతో, ఆకథ నిజమని సాక్ష్యం చెపుతున్నాయి ..

వేరే అడగడం ఎందుకు ? రాజసభవారు విచారించి తీర్పు చెప్పాలి. ఆంధ్రకవితాపితామహు లేమంటారు...

పెద్దన : సత్యం కల్పనాకథకంటె అద్భుతతరం....ఇపు డేమంటే ఏం లాభం !...

శ్రీకృష్ణ : అవును. ఏ మహాచక్రవర్తీ చచ్చిపోయిన మనిషిని బ్రతికించ లేడుకదా ?

తిమ్మ : అట్లే పతితను... పవిత్రం చేయలేం...

ధూర్జటి : ఈ అమ్మాయి దయనీయ...

తిమ్మ : ఉదయగిరీశ్వరులకు నీవంటే ప్రేమే గాని... మీ బావ మీద ద్వేషం లేదు కదా ?

మీనా : నిజమేకావచ్చు.... నా జీవితం ఏం కావాలి...

పెద్ద : పాత్రులవారు అపాత్రంగా ప్రవర్తించారు...

గజ : నేను ఘోరమైన తప్పుచేసాను. ఓటమి కంటె ఈ పశ్చాత్తాపమే నా హృదయాన్ని దహించివేస్తోంది. కృష్ణరాయలవారి కింక రత్వమే ఉదయగిరి దుర్గపాలకత్వంకంటె గొప్పదని ఈ చాకలి జీవితమే బుజువుచేసింది.

శ్రీకృష్ణ : ఇప్పు డేం చేయవలె ? పశ్చాత్తాపం వల్ల ప్రయోజనమేముంది? ఆ అమ్మాయినే ప్రార్థించవలె ఉదయగిరీశ్వరులు.

గజ : మీనాక్షీ ! నేను ఘోరం చేశాను. క్షమించు, నీమీద ప్రేమచేతనే చేశాను. ఇవి చేతులు కావు-కాళ్లు.

మీనాక్షి : నేను మిమ్ము క్షమిస్తే... భగవంతుడు నన్ను క్షమిస్తాడా ?

శ్రీకృష్ణ : తుది నిర్ణయం అప్పాజీ వారిదే.

తిమ్మ : ఇది చాలా చిక్కు సమస్య. (ఆలోచించి) ఈమె యిష్టముందో. లేకో పాత్రులకు లేదా అపాత్రులకు లొంగిపోయింది. అవివా హితయైన ఈమెకు ధర్మశాస్త్రప్రకారం పాత్రులే భర్త.

మీనాక్షి : ఆ ! మహామంత్రీ ! ఇదేనా మీ తీర్పు ? తమరు పాత్రులపై కారణాంతరాలచేత దయ చూపిస్తున్నారు. ఈ ప్రపంచంలో నానాటికి మానవునకు హృదయం క్షీణించి మెదడుమట్టుకు పెరుగు తోంది. మన నాగరికతలో మైరావణులు, హైరావణు లుద్భవిస్తు న్నారు. మీరు చేసిన అన్యాయానికి నా వుసురు వూరికేపోదు.

తిమ్మరుసు : ఆడవాళ్ళకు ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. ఇది నీ శ్రేయస్సు కోరే చెపుతున్నాను. ఉదయగిరీశ్వరులు ఈమెను భార్యగా స్వీకరించి అంతఃపురమర్యాదలతో గౌరవించాలి. ఈమెయే మీ రాణి.

పాత్రుడు : మహామంత్రివారి ఔదార్యంవల్ల నేను శాశ్వతంగా శ్రీకృష్ణ రాయలవారి పాదరేణువునై పోయాను. ఈమెను నెత్తిమీద పెట్టు కొని చూస్తాను. ఈమె విచారం మరచి పోయే టట్లు చూస్తాను...

శ్రీకృష్ణ : తల్లీ ! ఈ నిర్ణయం నీకు నచ్చకపోవచ్చు. కాని మేము నీ మంచి కోరి మాత్రమే చేశాము. నీ కోసమే ఇతన్ని నా ప్రతి నిధిగా ఈ దుర్గానికి ఆధిపతిగా నియమిస్తున్నాను. నీవే అతనికి రాణివి. మా అంతఃపురపరిచారికను నీకు చెలికత్తెగా యిస్తాను. ఏ కష్టమున్నా మా దేవితో నివేదించుకోవచ్చు.

(తెర)

★

శ్రీకృష్ణదేవరాయులు

ఆరవ రంగం

స్థలం: విద్యానగరం. పెద్దనకవి భవనం.

(పెద్దన మహాకవి. ధూర్జటి ఆశీనులై యుందురు. రామకృష్ణకవి ప్రవేశం)

రామ: శ్రీశ్రీశ్రీ ఆంధ్ర కవితా పితామహులకు దాసానుదాసుడు అడియేన్ దాసోహం....

పెద్దన: లే, రామలింగ కవీ! లే!

ధూర్జటి: ఇం కెక్కడి రామలింగకవి – రామకృష్ణకవి అనండి. తాతాచార్యులవారి ముద్ర పంగనామాలు కనుపించటం లేదూ!

రామ: నాకు ఆంధ్ర కవితా పితామహుని శిష్యత్వం సార్థకం చేయాలనిపించింది.

పెద్దన: మంచిది, నాయనా మంచిది.ఒకనాడు శ్రీకృష్ణదేవరాయలు కటక పురాధీశ్వరుని గెల్చి, అతని కుమార్తెను వివాహమాడి, దిగ్విజయ యాత్ర ముగించుకొనివచ్చి చిన్నాదేవిని దేవేరిగా అంతఃపురం చేర్చినాడు. ఇది ఇరవైయేళ్ళనాటి గాథ. నా కిప్పటికి నిన్న మొన్న జరిగినట్లే అనిపిస్తుంది. కాని యికముందు అటువంటి ఘన కార్యాలు చూడంకదా! మా యుగం గతిస్తోంది. మే మంతా ముసలివాళ్ళమై పోతున్నాము. భావి మీవంటి యువకులదే....

"కొలుతున్ మద్గురు విద్యా
నిలయున్ గరుణాకటాక్షనిధిజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శరగోపయతిన్."

రామ: దాసానుదాస్నో. అహమేన్. రామానుజాచార్య దివ్యాజ్ఞా వర్ధతాం, అభివర్ధతాం.

ధూర్జటి: రామకృష్ణకవికి పులిహోర, చక్కెరపొంగలి, దధ్యోదనంమీద ప్రేమ పుట్టింది.

రామ: లేకపోతే శివాలయంలో ఏముంది? బూడిద....

ధూర్జటి: ఉత్త చెయ్యి విష్ణుమూర్తికి చూపించి శ్రీవైష్ణవభక్తులు పులిహోర, చక్కెరపొంగలి ఆరగిస్తున్నారు కాని ఆ విష్ణువు నిజంగా ఆరగించటం మొదలుపెడితే - వైష్ణవుల జనసంఖ్యలో అధమ పక్షం — అహా — ఒక్కడయినా తగ్గుతాడు.... -

రామ: ఓహో! ఒక్కడా? ఎవరా ఒక్కడు?

ధూర్జటి: ఎవరన్నవారే!

రామ: అబ్బే! ఉడయవరు ఎంబెరుమన్నారు దివ్యదయకోసం - శ్రీ పెద్దన మహాకవిమీది భక్తితో....

ధూర్జటి: అదీమాట-నీకు కూడ పెద్దన మహాకవికి, మనుచరిత్ర కృతి ఇచ్చినపుడు జరిగినట్లే రాయలవారు పల్లకీ పట్టాలని ఉన్నది. ఏ ఎండ కా గొడుగు పట్టేవాళ్ళకు - రంగు ఫిరాయించే వాళ్ళకే రోజులు —

రామ: కవి అంటే పెద్దనమహాకవే! కృతిపతి అంటే రాయలవారే....

రాజభటుడు: (ప్రవేశించి పెద్దనకు లేఖ అందిచ్చును.)

రామ: (అందుకొని) శ్రీ వీరప్రతాప రాజపరమేశ్వర రాజమార్తాండ శ్రీశ్రీశ్రీ శ్రీకృష్ణదేవరాయ సార్వభౌములు, శ్రీశ్రీశ్రీ ఆంధ్ర కవితా పితామహులు అల్లసాని పెద్దనమహాకవిగారి నభినందించి అనుగ్రహించిన ఫర్మానా - శ్రీమదాంధ్ర కవితా పితామహులను శ్రీ రాయలవారు గోకట మండలమునకు రాజప్రతినిధిగా నియమింప సంకల్పించినారు. రాజలాంఛనములు - ఛత్రచామరాదులు గైకొనుటకు కొలువు కూటమునకు వేంచేయ శ్రీవారి అభ్యర్థనాదేశము - ఇతిశ్రీ.

పెద్దన: ఇది ఆంధ్ర సారస్వతంలో - దక్షిణాపథ చరిత్రలో స్వర్ణయుగం.

రామ : ఇక ఆంధ్రకవితా పితామహులు ఘంటముతోపాటు కవచం, శిరస్త్రాణం ధరించి రాజసంతో రాజసభలో కూర్చోవచ్చు.

పెద్దన : ఈయుగంలో పుట్టిన కవులు అదృష్టవంతులు. (గంట మోగించును. లోపలినుంచి పరిచారకుడు తాంబూలపు పళ్ళెంతో తిత్తితో ప్రవేశించును) — (భటునితో) చూడు నా కవచం శిరస్త్రాణం-ఉండాలి, మొగసాలలో. తీసి - తోమి, మెరుగు పెట్టు.

(భటుడు నిష్క్రమణము)

(తాంబూలం ధూర్జటికి - రామకృష్ణకవికి అందిస్తాడు)

ధూర్జటి :

వీడెంబిచ్చిన యప్పుడుం దమనుతుల్ విన్నప్పుడుం బొట్టలో
కూడున్నప్పుడు శ్రీవిలాసములు పైకొన్నప్పుడుం గాయకుల్
పాడంగా వినునప్పుడుఁ జెలగు దంభప్రాయ విశ్రాణన
క్రీడాసక్తుల నేమి చెప్పవలెనో శ్రీకాళహస్తీశ్వరా !

భటుడు : (ప్రవేశించి) మొగసాల గోడమీకుపై వ్రేలాడగట్టిన మీ కవచంలో తేనెపట్టు పట్టింది మహాకవీ.

పెద్దన : అవును. ఇంక కవచంతో పనేమున్నది ? రాయలు రాజ్యానికి వచ్చి యిరవై సంవత్సరా లయింది. కటకంనుంచి కన్యాకుమారి వరకు రాయల రాజ్యం వ్యాపించింది. మా కింకా ఇహచింత పోలేదు. కాని మహామహితాత్ముడు ధూర్జటి చూస్తుండగా ఐహికం రోసి భగవత్ సాక్షాత్కారంతో స్రుతికట్టుకొని కవిత్వం చెప్పుతున్నాడు.

ధూర్జటి : అంతమాట అనవద్దు.


"ఏ లీలఁ నుతియింపవచ్చు ఉపమోత్ప్రేక్షాధ్వని వ్యంగ్య శ
బ్దాలంకారవిశేషభాషల కలభ్యంబైన నీ రూపముఁ
జాలుంజాలు కవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో
చీ లజ్జింపరు గాక మాదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా !"

రామ : ఈ ధూర్జటిగారి కెందు కీ అకాలవార్ధకం ? పురాణయుగంలో మనదేశంలో సద్యోజీవనులు పుట్టేవారట. ఇప్పుడు సద్యో వృద్ధులు పుట్టుతున్నారు.

పెద్దన : రామకృష్ణకవీ ! పదేళ్ళక్రితం నేనుగూడా నీలాగే అనుకున్నాను. కాని ఇప్పుడు ధూర్జటి పద్యం చదివేటప్పుడు ఆతని తేజోనయనాలలో పుడమి కవ్వలి వెలుగులు నిలకడగన్న మెరుపుతీగలవలె మిరుమిట్లు గొలుపుచున్నవి.

ధూర్జటి : ఆంధ్రకవితాపితామహులు గోకటసీమకు అధిపతిగా నియుక్తులు కావటం కనులార చూడవచ్చురండి, పోదాం కొలువుకూటానికి.

[తెర]



శ్రీకృష్ణదేవరాయులు

ఏడవ రంగం

స్థలం: విద్యానగరం. శ్రీకృష్ణదేవరాయల కొలువు.

వందిమాగధులు: జయ. జయ (స్వస్తిశ్రీ సమస్తసద్గుణస్తోమ భద్ర. రణరంగరామభద్ర) శ్రీశ్రీశ్రీ మహారాజశ్రీ రాజపరమేశ్వర రాజమార్తాండ, గండరగండ, మూరురాయరగండ, పరగండ భైరవ, (వరసాహితీసమరాంగణచక్రవర్తి శ్రీశ్రీశ్రీ వీర శ్రీ కృష్ణరాయ భూపాళ్ర, విజయీభవ: దిగ్విజయీభవ:

"ఉదయాచలేంద్రమ్మ మొదల నెవ్వని కుమా
రతకు గ్రౌంచాచల రాజమయ్యె
నావాడపతి శకంధర సింధురాధ్యక్షు
లరిగాపు లెవ్వాని భరతరాసి
కాపంచ గౌడధాత్రీపదం బెవ్వాని
కసివారుగా నేగునట్టి బయలు
సకల యాచక జనాశాపూర్తి కెవ్వాని
ఘన భుజాదండంబు కల్పశాఖి
ప్రబల రాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశ బిరుద విభ్రాజి యెవ్వ
డట్టి శ్రీకృష్ణదేవరాయాగ్రగణ్యు
డధివసింపగ వచ్చు సింహాసనమ్మా."

శ్రీకృష్ణ: (ప్రవేశించి, సింహావలోకనము సల్పుచు) తెనాలి రామలింగ కవి ఇంకా సభకు రాలేదా!

ధూర్జటి: రామలింగం, రామకృష్ణుడు అవాలిగా - పట్టవర్ధనాది తీర్చి దిద్దడ్డూ! "మధ్య వైష్ణవులకు నామాలు పెద్ద"—

రామ : (ప్రవేశించి) జయం, జయం మహాచక్రవర్తికి...

శ్రీకృష్ణ : కవివృషభులు శ్రీ రామలింగంగారు కాదు రామకృష్ణకవి గారు దర్బారుకు ఆలస్యంగా వచ్చారు—సుఖంగా వున్నారా ?

రామ : ఆ సుఖమే మహారాజా ! కామధేనువు వంటి మహారాజు లున్నప్పుడు కవివృషభులకు లోటుంటుందా ?

శ్రీకృష్ణ : బాగుంది కవీ ! బాగుంది. నీ చమత్కృతికి సంతోషం. ఇదిగో ముత్యాలహారం...

ధూర్జటి : నేనుకూడా ఆలస్యంగా పస్తే బాగుండేదేమో ! ఏదో పిచ్చివాణ్ణి ముందుగా వచ్చాను.

శ్రీకృష్ణ : "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల గల్గె నీ యతులిత మాధురీమహిమ?" అసలు ఈ లోకంలో పిచ్చివాళ్ళు ఎవరు ? బాగుగా నిర్వచించినవారికి బంగారుపతకం బహూమానం—మహాకవి ధూర్జటిగారు చెప్పితే బాగుంటుందేమో !

ధూర్జటి : ఇప్పుడే ముత్యాలహారం పొందిన రామకృష్ణుడే ముందు చెప్పితే బాగుంటుంది.

శ్రీకృష్ణ : ఏం ! రామకృష్ణకవీ !

రామ : చిత్తం ప్రభూ ! నాకు లోకంలో అంతా తెలివిగలవాళ్ళే కనిపిస్తారు. ఈ ప్రపంచంలో అతితెలివి ప్రబలిపోయింది. ఎవడున్నాడండీ ! పిచ్చివాడు ? ఆలోచిస్తే నాకు విద్యానగర సామ్రాజ్యంలో పిచ్చివా డొక్కడే కనిపిస్తున్నాడు...

శ్రీకృష్ణ : ఎవరువారు ?

రామ : ఎవరన్నవారే !

తిమ్మ : రామకృష్ణకవికి ఎప్పుడు ఎవరితో మాటాడేదీ - ఎక్కడ మాటాడేదీ ఆలోచన అక్కర్లేదనుకుంటాను. ప్రాచీన నాటకాల లోని విదూషకపాత్రను మించిపోతూవుంటే...

శ్రీకృష్ణ : రామకృష్ణ కవిగారూ ! సభాసదులకు తమ అభిప్రాయానికి హేతువులు వివరిస్తారా !

ఘూర్జటి: ఆలస్యంగా వచ్చినందులకు ముత్యాలహారం బహుమానం యివ్వడమే !

రామ : ఎన్నటికీ కాదు.

తిమ్మ : అయితే రాయలే పిచ్చివారెట్లయ్యారు ?

రామ : మొన్న పారశీక అశ్వవర్తకులకు నలభై వేల వరహాలు బజానా ఇచ్చారు గదా ! వాళ్ళు మళ్ళీ పారశీకమునుండి తిరిగివస్తారూ !

తిమ్మ : ఇదా కారణం ? విజయనగర ప్రభువు లింతవరకూ, నరపతులు, అశ్వపతులైన తురకలను, జయించాలంటే మనకు అశ్వాలు కావాలి. స్వప్నప్రపంచంలో వుండే కవులకు ఎట్లా తెలుస్తుంది? అందుకనే తోకలు తెచ్చినా పూర్తి విలువ యిచ్చేస్తున్నాము...

రామ : అది బాగుంది - అంతేగాని ముందుగా నలభై వేలు యిస్తే ఈసారి అతోకలుగూడా తేరు.

శ్రీకృష్ణ : రామకృష్ణకవీ ! ఆగు ! ఆ మాటమీదే నిలబడు. ఒకవేళ ఆ వర్తకులు పారశీకంనుంచి గుఱ్ఱాలు తీసికొనివచ్చి యిస్తే ఏం చేస్తావు ?

రామ : ఏముంది ? పిచ్చివాళ్ళ జాబితాలో రాయలవారి పేరు కొట్టేసి అశ్వవర్తకుల పేరు వ్రాస్తాను.

శ్రీకృష్ణ : (విరగబడి నవ్వి) భళి ! భళీ ! ! నీవల్ల విదూషకపదవికే గౌరవం లభించింది. ఇదిగో బంగారు పతకం నీదే...(బంగారు పతకం యిచ్చును)

రామ : ధన్యవాదాలు...దీనిని దయతో అనుగ్రహిస్తే ఘూర్జటిమహాకవికి బహూకరిస్తాను.

శ్రీకృష్ణ : నిజమే బాగుంది. ఆ మహాకవిమీద కోపంతో ఇవ్వకూడదూ ! పోనీ మేము చెప్పిన పద్యాన్ని పూరించి అప్పైన—

రామ : ఏలినవారి చిత్తం...

శ్రీకృష్ణ : "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేలగల్గె నీ
యతులిత మాధురీమహిమ..."

రామ :

"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలగల్గె నీ
యతులిత మాధురీమహిమ"-"హా! తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమారవారవనితాజనతాఘనతాపహారి సం
తత మధురాధరోదిత సుధారసధారలు గ్రోలుటన్ జుమీ!"

[పతకం ధూర్జటికి ఇచ్చును]

(సభలో హర్షధ్వనులు)

ధూర్జటి : మహాప్రభూ ! అల్లాటప్పా గాలికబుర్లకవిత్వం చెప్పి -
ప్రభువులదగ్గర ముత్యాలహారాలు, బంగారు పతకాలు పొందటం
రామకృష్ణుని అదృష్టం...కాని...

రామ : అయితే అసలు సిసలైనకవిత్వం ఏమిటి ?

ధూర్జటి : ఆ విషయమే. సంస్కృతాంధ్రాలలో అనర్ఘధారగా ఏ మహా
కవి విద్వత్ సభా సమక్షములో ప్రతిపాదిస్తాడో, ఆ మహా
కవిని నిండు సభలో సత్కరించాలి.

శ్రీకృష్ణ : నిజమే, ఉభయభాషల్లో ఉత్పలమాలలో కవితాతత్వం ప్రతిపా
దించే మహాకవి కాలికి మాచేతితో గండపెండేరము తొడిగి
బహూకరిస్తాము....[జయజయధ్వనులు]

రామ : ధూర్జటికవి చెప్పితే సంతోషం...

ధూర్జటి : నేను చెప్పను - చెప్పకూడదు కూడాను. విషయాన్ని నేనే
ప్రతిపాదించాను. కాబట్టి - రామలింగం చెపుతే...

రామ : నాకు గాలికబుర్లఅల్లాటప్పా కవిత్వంతప్ప హిమాలయనిర్ఝరిణి
వంటి అనర్ఘధారే ! అమ్మో !

శ్రీకృష్ణ : మహాకవులెవరైనా సరే ! మా ఆస్థానంలో అష్టదిగ్గజా
లున్నారుకదా !

[సభలో మౌనం]

భటు : (పసిడిపళ్లెరములో గండపెండేరము తెచ్చి రాయలకు ఇస్తాడు).

శ్రీకృష్ణ : ఈ మౌనం సామ్రాజ్యప్రతిష్ఠకే కళంకం, ఈ గండపెండే
రానికి అర్హులు లేరా ! ఆంధ్రకవితా పితామహా !....

"ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపగా
నొద్దిక నా కొసంగు మని యొక్కరు గోరగ లేరు లేరొకో-"

పెద్ద : [లేస్తూ]...

"పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీ వెఱుంగవే...
పెద్దన కీ దలంచినను బేరిమి నాకిడు కృష్ణరాణ్ణృపా !"

[సభాసదులు హర్షధ్వనులు]

శ్రీకృష్ణ : ఆంధ్రకవితాపితామహులు ఉత్పలమాల ఉపక్రమించుదురు
గాక.

పెద్ద :

"పూతమెఱుంగులుం బసరు పూప బెడంగులు జూపునట్టివా
కైతలు ! జగ్గు నిగ్గు నెనగావలె గమ్మున గమ్మనన్వలెన్
రాతిరియుంబవల్ మరపురాని హాయల్ చెలి యూరజంపు ని
ద్దా తరి తీపులంబలెను దారసిలన్వలె లోదలంచినన్
బ్రాతిగ బైకొనన్వలెను బైదలి కుత్తుకలోని పల్లటీ
కూతలనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలంది గౌగిటను జేర్చిన గన్నియ చిన్నిపొన్ని మే
ల్మాతలచన్నుదోయివలె ముచ్చటగావలె బట్టిచూచినన్
డాతొడ నున్న మిన్నుల మిటారపు ముద్దుల గుమ్మ కమ్మనౌ
వాతెఱ దొండపండువలె వాచవి గావలెఁ బంటనూదినన్

గాతలదమ్మిచూలిదొర కైవసపుం జవరాలి సిబ్బెపు
న్నేతెలియబ్బురంపు జిగి నిబ్బర పుబ్బగు గబ్బిగుబ్బ పొం
బూతల నున్న కాయ సరిపోడిమి కిన్నెర మెట్ల బంతి సం
గాతపు సన్నబంతి బయకారపు గన్నడ గౌళపంతుకా
సాతత తానతానల పసందివుటాడెడు గోటమీటుబల్
మ్రోతలునుంబలెఁ హారువు మొల్లము గావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతంబు పచరించిన పట్టున భారతీ వధూ
టీ తపనీయగర్భ నికటీభవ దానన పర్వ సాహితీ
భౌతిక నాటక ప్రకర భారత భారత సమ్మత ప్రభా
పాత సుధాప్రపూర బహుభంగ ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మ లయసంగతి చుంచు విపంచికా మృదం
గాతత తేహి తత్తహిత హోధి తదంధణు ధాణు ధింధిమి
వ్రాత లయానుకూల పదవార కుహూద్వహ హారి కింకిణీ
నూతన ఘల్ఘులాచరణ నూపుర ఝూళఝుళీ మరంద సం
ఘాత వియద్ధునీ చకచకద్వికచోత్పల సార సంగ్రహా
యాత కుమారగంధవహ హారి సుగంధ విలాసయుక్తమై
చేతము చల్లజేయవలె జిల్లున జల్లవలె న్మనోహర
ద్యోతక గోస్తనీఫల మధుద్రవ గోఘృత పాయస ప్రసా
రాతి రసప్రసార రుచిర ప్రసరంబుగ సారెసారెకున్."

(హర్షధ్వనులు)

శ్రీకృష్ణ : ఆంధ్రకవితాపితామహా! నీ బిరుదు సార్థకమైనది - ఇదిగో హేమరత్నమాణిక్య స్థగితమైన గండపెండేరం...

పెద్దన : ధన్యోస్మి ! ధన్యోస్మి !! ఈ మధురక్షణం నా జీవితంలోనే గాక విశ్వసాహిత్య చరిత్రలో చిరస్మరణీయం....

ధూర్జటి : ఈ మహోజ్వల ముహూర్తం తలచుకొని యుగయుగాలు పులకిస్తాయి....

శ్రీకృష్ణ : శిరీష కుసుమ పేశల సుధామయోక్తుల సంస్కృతాంధ్రాలలో ఆశువుగా పలికించిన ఈ ఉత్పలమాల ఆంధ్రసాహిత్యంలో ఆచంద్రతారార్కం నిలుస్తుంది. సంస్కృతంలో రామాయణ, మహాభారతాల శాశ్వతత్వంతో తులతూగే అమరత్వం ఈ ఆశు ధార సంపాదించుకున్నది.

పెద్దన : మహాప్రభువుల కటాక్షానికి రసజ్ఞతకు సాహితీలోకం శాశ్వత ఋణగ్రస్తం - ఈ బహుమానం నాకుమాత్రమే చెందదు. కవుల కాళ్ళకు శాశ్వత పవిత్రత ఆపాదించారు రాయలవారు - అంతే. రామాయణ మహాభారతా లెక్కడ, యీ ఉత్పలమాలా పంక్తు లెక్కడ !....

శ్రీకృష్ణ : అయితే నా కొక సందేహం వున్నది. రామాయణం గొప్పదా? భారతం గొప్పదా ?

రామ : ఏమున్నది ? రామాయణ పండితులు రామాయణం గొప్ప దంటారు. భారత పండితులు భారతం గొప్ప దంటారు.

శ్రీకృష్ణ : అదిగాదు - రెంటిలోను సౌభ్రాత్రం చిత్రింపబడింది. రామ. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు గొప్పవారా ? పంచపాండవులు గొప్పవారా ?

ఘూర్జటి : ప్రభువులవారే యీ విషయం తేల్చాలి.. .

శ్రీకృష్ణ : అది పండితులు చెప్పాలి. అంతేకాని మాకేం తెలుస్తుంది?

పెద్దన : ప్రభువుల అభిప్రాయం వినాలని సభవారికి కుతూహలంగా వుంది.

శ్రీకృష్ణ : నేను పండితుణ్ణి కాకపోయినా నా ఉద్దేశంలో పంచపాండవులే గొప్పవారు.

సభ్యులు : "భారత పండితులకు జై-రామాయణ పండితులు బహుపరాక్."

చాకలి : దేవరవారు రూపాంతరంలో వున్నా పాండవులమీద పక్షపాతం మట్టుకు పోనిచ్చుకోలేదే! (హర్షధ్వనులు)

సభ్యులు: "భారత పండితులు బహుపరాక్-రామాయణ పండితులకు జై."

శ్రీకృష్ణ: చాకలీ! ఎంత బాగా చెప్పేవురా! నేను తొందరపడి ఆది కావ్యానికి అపచారం చేశాను. నీవు నన్ను శ్రీకృష్ణుని అవతారం అని స్తుతిస్తూనే పక్షపాతాన్ని సుకుమారంగా చెప్పి, ఆదికావ్యానికి భువనవిజయంలో జరిగిన అన్యాయాన్ని అరికట్టావు.

చాకలి: ఏదో ఆంధ్రభోజుల్ని చూస్తే నా గుండెలోగూడ గంగానది పొంగిందండి బాబయ్యా!

శ్రీకృష్ణ: చాకలీ! భువనవిజయసాహిత్యమర్యాద నిలిపినందుకు సంతోషం. నీకేని కావాలో కోరుకో.

చాకలి: కోరుకోమంటారా! దేవరా!

శ్రీకృష్ణ: కోరుకో! జంకకు.

చాకలి: దేవర! కోట ఏలుకోవాలని వున్నది.

తిమ్మరుసు: ఆ! కోట ఏలుకోవాలా! చాకలీ! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?

శ్రీకృష్ణ: చాకలీ! భయం లేదు - మే మన్న మాట తిరగను.

తిమ్మ: ప్రభూ! ఈ చాకలి కోరిక నెరవేరితే సామ్రాజ్యగౌరవం మంట కలిసిపోతుంది. సాహితీ సమరాంగణ సార్వభౌములు సాహిత్యం మీదే మొగ్గు చూపిస్తున్నారు. చాకలి దుర్గాధిపతి - రాజధానికి దళవాయి అయితే...

శ్రీకృష్ణ: అప్పాజీ! నిండుసభలో సాహిత్యగోష్ఠిలో అన్న మాట ఎట్లా తప్పటం? బలి, శిబివంటి చక్రవర్తులు కలియుగంలో పుట్ట కూడదా? మహానుభావుడు పోతన ఎంత చక్కగా అన్నాడు - "కారే రాజులు రాజ్యముల్ కలుగవే - వారేరీ సిరి మూటగట్టు కొని పోవం జాలిరే!"

తిమ్మరుసు: బాగుంది! "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అని వూరికే లోకోక్తి పుట్టలేదు.

పెద్ద : కోరుకోమంటే పుసుక్కున ఎంత కోరిక కోరేశావురా ? చాకలీ!

చాకలి : చిన్నప్పటినుంచి రాయలవారికి చాకిరీ చేశాను. వార్ని ఆశ్ర యించుకొన్న వారందరూ పైకి వచ్చారు. ఏదో నాకుకూడా ఈనాటికి బుద్ధి పుట్టింది. రాయలోరి ఇశాల రాజ్యంలో ఎంత మంది సామంతులు లేరు...

శ్రీకృష్ణ : నీ కోరిక తప్పక నెరవేరుస్తాము. అప్పాజీ! మా మాట బీరు పోకుండా తుది నిర్ణయము చేసే బాధ్యత మీదే!

తిమ్మరుసు : అదే ఆలోచిస్తున్నాను. విను! చాకలీ! రాయలవారు నీ కోరిక అనుగ్రహించారు. నీ కోరిక "దేవర"—కోట ఏలుకోవాలని కదూ. మొన్ననే ఒక క్రొత్త కోట కట్టించాం. దానికి దేవరకోట అని పేరు పెడుతున్నాము. ఆ చుట్టుపట్ల గల రెండుగ్రామాలతో సహా నీ అధీనంలో ఉంటుంది. నీవు ఆ దుర్గాన్ని ఏలుకో.

శ్రీకృష్ణ : ఏం చాకలీ! నేటినుండి నీవు దేవరకోట సంస్థానాధిపతివి—

చాకలి : తమ దయవల్ల నేనుకూడా ఏదో ఒకకోట ఏలుకుంటాను.

తిమ్మరుసు : ఇంక వింజామర వదలి భుజకీర్తులు ధరించు. నీవు దేవర కోట వెంటనే వెళ్ళవచ్చు. ఊఁ—

చాకలి : చిత్తం సెలవు. జయం జయం రాజపరమేశ్వరులకు.

(నిష్క్రమణ)

శ్రీకృష్ణ : అప్పాజీ! మీ యుక్తివల్ల యేదో మారు మూల కోటకు ఈ చాకలిని పంపారు. వాడు దానికే సంతోషిస్తున్నాడు.

పెద్దన : మేం భయపడ్డాం. విద్యానగర దుర్గమునకు దళవాయి అవుతా డేమోనని.

శ్రీకృష్ణ : మేమూ భయపడ్డాం—కాని మాకు అప్పాజీయుక్తిమీద అపార ధైర్యం వుంది. అప్పాజీ! ఏనాడో మాకత్తికి తుప్పు పట్టింది. కాని మీ యుక్తికి రోజురోజూ పదు నెక్కువవుతోంది.

తిమ్మరుసు : ప్రభువులు నా యు క్తిమీద ఎపుడూ యింత గ్రుడ్డి నమ్మకం పెట్టుకోటం నాకు చాలా భయంగా వుంది. అన్నప్పుడల్లా అయినదీ కానిదీ సాధించగలమా ?

శ్రీకృష్ణ : అప్పాజీకి కూడ భయమా ? ఎందుకు ?

భటుడు : [మీనాక్షితో ప్రవేశించి] భయంకరవా ర్త - మహాప్రభూ ! భయంకరవా ర్త.

తిమ్మ : ఏమిటది !

భటుడు : మహాప్రభూ ! ఉదయగిరి దుర్గాధిపతి శ్రీ ప్రహారేశ్వరపాత్రుల వారు ఆకస్మికంగా గుండె ఆగిపోయి మరణించారు.

తిమ్మరుసు : గుండె ఆగకుండా ఎవరైనా మరణిస్తారా ! మరణానికి కారణం ?

భటుడు : విషప్రయోగం. పాత్రుల భార్య ఈ మీనాక్షమ్మగారే. తానే భర్తకు విషమిచ్చి చంపినట్లు ప్రకటించింది.

శ్రీకృష్ణ : విషప్రయోగమా ! మీనాక్షీ ! పాత్రుల అంతఃపురంలో విషం ఎట్లా లభించింది ?

మీనాక్షి : ప్రభూ ! విషం ఎక్కడ లేదు? నాకు ప్రపంచ మంతా ఇదివరకు విషమయంగానే కన్పించింది. కాని పాత్రులు మరణించిన మరు క్షణంనుండి ఈ సృష్టంతా అమృతమయమై సాక్షాత్కరిస్తోంది.

శ్రీకృష్ణ : అదికాదు. మీ అంతఃపురంలోకి విషం ఎవరు తీసుకొని రావటానికి సాహసించారు ?

మీనాక్షి : ప్రభూ ! మా అంతఃపురంలోకేకాదు. అవసరమైతే మీ అంతఃపురంలోకిమట్టుకు విషం తీసుకురాగల సాహసులు లేరనా మీ వెట్టి అభిప్రాయం !

తిమ్మరుసు : మీనాక్షీ ! నీ వెవరితో మాట్లాడుతున్నావో నీకు తెలుసా ?

మీనాక్షి : తిమ్మరుసుమంత్రి చేతి కీలుబొమ్మతో.

తిమ్మరుసు : భర్తకు విషం పెట్టి చంపిన పిశాచం. ఎట్లాగైనా మాట్లాడవచ్చు. మా కోట అంతఃపురం కట్టుబాట్లు నీకేం తెలుసు? నీ నేరానికి శిక్ష తెలుసా?

మీనాక్షి : తెలుసు. కాని అందరికి శిక్ష వేయగలవాడు ఆ పరమాత్ముడొక్కడే.

భటుడు : (ప్రవేశించి) ప్రభూ! ప్రభూ!! దేవరవారికి యువరాజుగారు ఆకస్మికంగా ఆక.స్మికంగా గుండె ఆగిపోయి మరణించారని తెలుపటానికి భయపడుతున్నాను....

శ్రీకృష్ణ : ఆ! యువరాజు మరణించాడా? కొలువుకూటానికి బయలు దేరేటప్పుడు నాతో కులాసాగా మాట్లాడేడే!

మీనాక్షి : గుండె ఆగకుండా ఎవరైనా మరణిస్తారా? రాజకుమారుని మరణానికి కారణం? మహారాజా! అంతఃపురంలో యువరాజునకు కూడా విషప్రయోగం జరిగింది.

తిమ్మరుసు : అసంభవం. యువరాజు స్వయంగా నా సంరక్షణలో వున్నాడు.

మీనాక్షి : పాత్రులవారు కూడా నా సంరక్షణలోనే విషం త్రాగారు.

శ్రీకృష్ణ : అప్పాజీ ఈ వార్త విని ఈ వృద్ధాప్యంలో నా గుండె వేయి చెక్కలు గాకుండా నిలచి ఉండే!

తిమ్మరుసు : ప్రభువులు గుండె రాయి చేసుకోవాలి.

ధూర్జటి : ఆపదలందే ధైర్యము అవసరం.

శ్రీకృష్ణ : ఇంకేమిధైర్యం మహాకవీ! అప్పాజీ! ఇంక సామ్రాజ్యం ఏం కావాలి? ఎనిమిదేండ్లు నిండిన పుత్రుడు నిలువునా కూలిపోయాడే? ఇక ఎనిమిదినెలల పుత్రుడున్నాడు.

తిమ్మరుసు : భగవంతుని లీలలు మన కర్థం కావు. అవన్నీ అతని యిష్ట ప్రకారం జరిగితీరాలి. మన యిష్టప్రకారం జరుగవు. జరుగ కూడదు.

శ్రీకృష్ణ : జరుగకూడదా ! మహామంత్రీ ! అంటే యువరాజు మరణము
దైవసమ్మతమా ! అది జరిగితీరాలా ! ఇందులో కుటిలరాజనీతి
ఇమిడియున్నదన్నమాటేగా ?

తిమ్మరుసు : అంటే మహాప్రభూ ! మీ ఉద్దేశం ?

శ్రీకృష్ణ : మా ఉద్దేశ మేమున్నది ? పిల్లవాని రక్షణ బాధ్యత స్వయంగా
మహామంత్రి కప్పగించాంకదా ! ఈ ఆకస్మికమరణానికి కారణం ?

మీనాక్షి : విషప్రయోగమే మహాప్రభూ ! విషప్రయోగమే !

తిమ్మరుసు : బాగుంది ! మహాకవి పోతన చెప్పలేదూ !

"రాకన్మానవు హాని వృద్ధులు మహారణ్యంబులో డాగినన్
పోకన్మానదు ప్రాణ మే విధమునన్ పోషించి రక్షించినన్."
పిల్లవాడు పోగానే మతికూడా పోకూడదు.

శ్రీకృష్ణ : అయితే, నాకు మతి పోయిందన్నమాట నిజమే. ఇంతవరకూ
మంత్రిచేతిలో కీలుబొమ్మనై మతి పోగొట్టుకున్నాను. మహా
మంత్రీ ! జ్ఞాపకం తెచ్చుకో—ఒకనాడు సామ్రాజ్య సంరక్షణ
కోసం అవసరమైతే శ్రీకృష్ణరాయల పుత్రుణ్ణి హత్యచేయడానికి
కూడా వెనుకాడనని నీవు చెప్పావు. మతిలేక యువరాజును నీ
అధీనం చేశాను. ముక్కుపచ్చలారని బిడ్డను పొట్టబెట్టుకుంటా
వనుకోలేదు. అప్పాజీ ! అని పిలచి నిన్ను తండ్రిగా చూచు
కొన్నాను.

తిమ్మరుసు : ఇప్పటికి కాని నాకు జ్ఞానోదయం కాలేదు. ఎవనికి నేను
ప్రాణభిక్ష పెట్టి పుత్రనిర్విశేషునిగా చూచానో అతని నోటి
వెంటే ఆమాట వస్తేనే గాని నాకు బుద్ధిరాదు. నేను నా యుక్తిని,
నా శక్తి సామర్థ్యములు నమ్మి ఆ పరమాత్మను గూడ లెక్క
చేయలేదు. నాకు భగవంతుడు తగిన శాస్తే విధించాడు.

శ్రీకృష్ణ : నేను మతిపోయి ప్రాణభిక్ష పెట్టిన పితృపాదుని క్రింద
చూసాను. కాని ఆనాడే సామ్రాజ్యంకోసం—దక్షిణాపథ రక్షణ

కోసం, హైందవ సంస్కృతి సంరక్షణకోసం మా అన్నగార్ని మోసగించి, నాకు ప్రాణదానం చేసినట్లు సుస్పష్టంగా ప్రకటించావు. అనాడే నా పుత్రుడైనప్పటికి ఒకవేళ బాలుడైఉంటే సింహాసనం ఎక్కనీయకుండా హత్య చేయడానికి జంకనని స్పష్టంగా ప్రకటించావు. మతిపోయి అమాట మరిచిపోయాను.

తిమ్మరుసు : బాగున్నది। ఉపకారానికి మంచి ప్రత్యుపకారం—భగవంతుడు చేసినదానికి—

మీనాక్షి : భగవంతుడు కూడా తిమ్మరుసు చేతిలో కీలుబొమ్మన్నమాట.

ధూర్జటి : మహాప్రభూ। యువరాజును హత్యచేసి తిమ్మరుసు బావుకునే దేముంది?

పెద్దన : సత్యం నిలకడమీద కాని తెలియదు. ప్రభువులు నిదానించాలి.

శ్రీకృష్ణ : అమాయికులైన కవులకు రాజనీతి ఏంతెలుసు। మా అన్నగారి పుత్రులు శిశువులనేగదా నన్ను గద్దె ఎక్కించింది. నా ఆరోగ్యం చెడిపోయిగదా నా కుమారుని అప్పాజీ అనుకొనిన తిమ్మరుసు చేతిలో పెట్టాను।

ధూర్జటి : ఆ। ప్రభువులకు అనారోగ్యమా।

శ్రీకృష్ణ : ఆ విషయం ఒక్క తిమ్మరుసు మంత్రికే తెలుసు. ఎనిమిదేండ్ల యువరాజు విజయనగరసింహాసనం అధిష్ఠించడం తిమ్మరుసుకు చచ్చినా యిష్టం ఉండదు.

తిమ్మరుసు : చరిత్ర చర్వితచర్వణం అవుతుండని ప్రభువుల ఉద్దేశ్యం కాబోలు.

శ్రీకృష్ణ : ఆ చరిత్రపాఠం తిమ్మరుసు మంత్రిదగ్గరే చిన్నప్పుడు నేర్చుకొన్నాను. చరిత్ర నేర్పిన పాఠాలు మరచిపోని వ్యక్తి ఒక్క తిమ్మరుసుమంత్రే. పాఠం నేర్చుకొనికూడా యువరాజును మంత్రి చేతిలో పెట్టాను.

తిమ్మరుసు : ప్రభూ ! నా మనుమణ్ణి నేను చంపగలనా ! తిమ్మరుసుమంత్రికి హృదయం లేదూ !

శ్రీకృష్ణ : హృదయాన్ని చిలక్కొయ్యకు వేసిగాని రాజు, మంత్రీ రాచ కార్యాలలో ప్రవేశించరాదని గురువుగారిదగ్గర నేను నేర్చుకొనిన ప్రథమపాఠం.

తిమ్మరుసు : నేను నేర్పిన పాఠాలు ఇంత వింతగా వప్పచెప్పుకోవలసి వస్తుందని కలలోకూడ అనుకోలేదు—సరే !—ప్రభూ ! నేనిక మాట్లాడి ప్రయోజనం లేదు.

శ్రీకృష్ణ : అట్లా తప్పు ఒప్పుకోవటం మంచిది. కాని రాజద్రోహానికి శిక్ష మరణదండన. గురువుగారు నేర్పిన పాఠమే. శంకాటంకాలు పనికిరావు. కాని నేను గురువుకు తగిన శిష్యుణ్ణి కాలేకపోయాను పూర్తిగా—మహామంత్రీ ! ఈ ద్రోహానికి శిక్ష నీవే కోరుకో—తుది నిర్ణయం ఎప్పుడూ అప్పాజీవారిదే కద !

తిమ్మరుసు : నాకు ప్రపంచంమీద ఇష్టం గాని, ప్రాణంమీద తీపి గాని లేదు.

శ్రీకృష్ణ : కాని ! అప్పాజీకి చేతులారా నేను మరణశిక్ష విధించలేను. సేనాపతీ !

సేనాపతి : చిత్తం.....

శ్రీకృష్ణ : తిమ్మరుసుమంత్రి కన్నులు పీకించి ఆజన్మాంతం ఖైదులో వేయించు.....

తిమ్మరుసు : మహారాజా ! ఒకనాడు నీ కన్నులు నా చేతులో ఉన్నాయి. ఆ నాడు రాజద్రోహం చేసి నరసింగరాయమహారాజుకు మేక కన్నులు చూపించి —నీ కన్నులు— ప్రాణంకూడా ప్రసాదించాను. ఆ నాటి రాజద్రోహానికి ఈనాడు అదేశిక్ష నాకు భగవంతుడు విధించాడు. అంతే ! నే నెప్పుడూ ఎవరికీ భయపడలేదు. కాని ఆప్పుడప్పుడు అమాయకమైన ఆ మేక గ్రుడ్లు పీకిన నాటి దృశ్యం

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆ ఆర్తనాదం వినిపించి నేను కంపించి పోయేవాణ్ణి. నా కత్తినీ, నన్నూ చూచి బెదురుచూపులతో మే-మే అన్న ఆర్తధ్వని నా గుండెల్లో యింకా ప్రతిధ్వనిస్తోంది. ప్రభూ ! నీవు నాకు మేలే చేశావు. ఇంతవరకు నాకు నా శక్తి, నా యుక్తి, నా సమర్థత, నా చాకచక్యంమీద ఉన్న విశ్వాసం, భగవంతుని మీద కూడ లేదు. ఇప్పుడు సర్వశక్తిమయుడైన ఆ భగవంతుడు తప్ప నాకింకేమీ కనిపించటంలేదు.

శ్రీకృష్ణ : తిమ్మరుసు మంత్రి గ్రుడ్లు చూసేవరకూ నాకు మాత్రం భగవంతునిమీద కూడా విశ్వాసంలేదు. సేనాపతీ ! - ఈ మీనాక్షికి కూడ తిమ్మరుసు మంత్రితోపాటు యావజ్జీవకారాగారవాసం విధిస్తున్నాను. వారికి కావలసిన సౌకర్యాలన్నీ సమకూర్చండి. రాజ్యంలో సైనికశాసనం అమలులోకి వచ్చినట్లు ప్రకటించండి.

[నిష్క్రమణం - రణభేరి]

(తెర)

★

శ్రీకృష్ణదేవరాయలు

ఎనిమిదవ రంగం

[స్థలం: విద్యానగరం వీథి]

(తెనాలి రామకృష్ణుడు ఒక ప్రక్కనుండి,
ధూర్జటి మరియొక ప్రక్కనుండి ప్రవేశం)

రామ: ధూర్జటికవికి నమస్కారం।

ధూర్జటి: ఏం రామకృష్ణకవీ। ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలు, పట్టివర్ధనాలు బాగా తగిలించేవే। శిష్యసంచారం కూడా మొదలు పెట్టావా?

రామ: ఒక్కొక్క మహాయుగంలో ఒక్కొక్క ఉద్యమం ఉద్భవిస్తుంది. ప్రగతిశీలులంతా ఆ మహోద్యమానికే జీవితాన్ని అంకితం చేసుకుంటారు. నేను కూడా కృష్ణరాయల మహాయుగానికి నా బ్రతుకును పూర్తిగా శ్రుతికిల్పుకోవాలని వైష్ణవం స్వీకరించాను.

ధూర్జటి: బాగుంది కవీ। భగవంతుని ఆరాధించటానికి మతం మార్చనక్కరలేదు. ఆధ్యాత్మికదృష్టితో మతం మారిస్తే మంచిదేకాని ఐహికదృష్టితో అర్థంకోసమో, పదవికోసమో, రంగు ఫిరాయిస్తే నిర్మొగమాటంగా చెప్పాలంటే నాకు—అసహ్యం.

రామ: నిజమే మహాకవీ। అన్ని మతాల్లోనూ ఉన్న దేవు డొక్కడే అయితే అట్లాంటప్పుడు లాభం కలిగే మతంలోనే ఉంటే ఇహపరాలను రెండూ సాధించవచ్చుగా - అందరూ చెప్పేది ఒక్కటే అయినపుడు ఎందు కీ పిచ్చి తగాదాలు, వితండవాదాలూను —

"అర్ధపాత్ర శూన్యమైనదనె ఒకడు
ఒకడు సగము నీరు ఉన్నదనెను

వాదభేదమునను బ్రద్దలచ్యె తలలు
రమ్యహాసలోల రామకృష్ణ !"

ధూర్జటి : ఎందుకీ ప్రజ్ఞావాదాలు....

"ఆయవారై చరియింపవచ్చు తన పాదాంభోజతీర్థంబులన్
దయతో గొమ్మనవచ్చు నేవకుని అర్థప్రాణదేహాదు ల
న్నియు నా సొమ్మనవచ్చుఁగాని సిరులన్ నిందించి నిన్నాత్మ ని
ష్క్రియతం గానగరాదు పండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా !"

రామ : మహాకవీ ! ఎందుకు నీకీ విరక్తి ? మన మీ మహాయుగ ప్రవక్త
లమై అష్టదిగ్గజ సింహాసనాలను అధిష్ఠించి శ్రీకృష్ణదేవరాయలతో
పాటు చరిత్రలో శాశ్వతస్థానం పొందే అదృష్టం లభించింది. .

ధూర్జటి : చదువుల్ నేర్చిన పండితాధముల మీదను, మహారాజుల మీదను
నాకు నమ్మకం పోయింది. శ్రీకాళహస్తీశ్వరునిమీద నా మనస్సు
లగ్నమైపోయింది. చూశావా ! మహామంత్రి తిమ్మరుసు కేగతి
పట్టిందో - శ్రీకృష్ణదేవరాయ లంతటి వాడేం చేశాడో....

"తరగల్ పిప్పలపత్రముల్ మెరుగుటద్దంబుల్ మరుద్దీపముల్
కరి కర్ణాంతము లెండమావుల తతుల్ ఖద్యోతకేటప్రభల్
సురవీథీలిఖితాక్షరంబు లసువుల్ జ్యోత్స్నాపయఃపిండముల్
సిరులండేల మదాంధులౌదురో జనుల్ శ్రీకాళహస్తీశ్వరా !"

రామ : ఆహా ! మహాకవి వాక్కు నిజమే ! శ్రీకృష్ణదేవరాయల ప్రాణాలు
మినుకు మినుకు మంటున్నాయి. ఈ మహాయుగానికి అవసానం
ఆసన్నమైంది.

ధూర్జటి : ఆ ! రాయలు మరణశయ్యమీద ఉన్నాడా ! అయ్యో పాపం !

రామ : మరణశయ్యమీద రాయలు పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడట.

ధూర్జటి : రామకృష్ణకవీ ! మనం పోయి మహారాజు అంతిమదర్శనం
చేసుకుందాము - రా -

[నిష్క్రమణ]

శ్రీకృష్ణదేవరాయలు

తొమ్మిదవ రంగం

[స్థలం: కారాగారము - సమయం: ప్రాతఃకాలం]

(దూరంగా మేలి కొలుపు పాట వినిపిస్తుంది)

"మేలుకొనుమో భరతవీరా !
మేలుకొనుమో పూతచరితా !
మేలుకొనుమో సర్వమానవ
సౌఖ్యవేదాంతీ !
గగనమందున కారుమబ్బుల
కటికచీకటి క్రమ్మిచున్నది
ప్రళయఝంఝూపవనఘోషా
ఘూర్ణ గర్జనలన్....
భారతీయులు కర్మవీరులు
భారతీయులు జ్ఞానయోగులు
భారతీయులు త్యాగమూర్తులు
యుగయుగమ్ములలో....

మీనాక్షి: (పాడుకుంటూ కూర్చుంటుంది - నౌబత్‌నగారా వినిపిస్తూంటుంది)

[నేపథ్యంలో]

తిమ్మరుసు: తల్లీ! మీనాక్షీ! తెల్లవారిందామ్మా?

మీనాక్షి: తెల్లవారుతోంది లేచిరండి! బాబుగారూ! - అయ్యో పాపం!

తిమ్మరుసు : మీనాక్షీ ! ఎందుకు తల్లీ ! నీవే కోరికోరి నన్ను కాచుకొని ఉండాలని వచ్చావు ? నా మీద నీ కెందుకమ్మా ఈ నిర్హేతుక ప్రేమ.

మీనాక్షి : బాబుగారూ ! అదేమిటి ? రోజూ ఇట్లాగే అంటారే. ప్రేమ ఎప్పుడూ నిర్హేతుకమే. కాని మీకు శిక్ష పడినప్పటినుంచి నేను పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాను. మీకు సేవ చేస్తే ఈ విధంగా నైనా నా పాపానికి నిష్కృతి కలుగుతుందేమోనని ఆశిస్తున్నాను.

తిమ్మరుసు : తల్లీ ! ప్రతివిషయానికీ ఏవో కారణాలు ఉన్నవీ, లేనివీ కల్పించుకొని అతి తెలివితేటలతో భగవంతుని కూడ స్మరించని నా పాపం ఈ విధంగా పండింది. ఇది ప్రాయశ్చిత్తం - ప్రాయశ్చిత్తం - అమ్మా !

మీనాక్షి : బాబుగారూ ! నేను చేసిన పనికి భగవంతుని ముందుకూడ సిగ్గుపడకుండా నించోగలను. నాకు ఆ దుర్గాధిపతి భార్యగా రాజభోగాలు అనుభవించడంకంటె ఈ ఖైదులో ఈ కష్టాలను అనుభవించడమే సంతోషంగా వుంది. అదీగాక మీ కేదో సేవ చేసే అవకాశం లేకపోతే నేను బ్రతకటమే దుర్భరమైపోయేది.

తిమ్మరుసు : పిచ్చితల్లీ ! నేను నిజం చెపితే నా మీద నీకు అసహ్యం పుడుతుందేమో ! పోనీ పుట్టనీ - నిజం దాచుకొని దోషాంత రంగంతో కుమిలిపోలేను. ఆ నాడు తీర్పు చెప్పినప్పుడు.....

మీనాక్షి : పాపం ! మీరేం చేస్తారు ? దిక్కు లేని దాన్ని రక్షించాలను కొన్నారు. అతనికి ఒకసారి లొంగిపోయినపుడు ఇం కెన్ని సార్లైతే యేం— ఏదో అతనితో నే ఉండక తప్పదుకదా ! అని మీ కనిపిస్తుంది. కాని నా గుండెలో మా బావను తల్చుకున్నప్పుడు ఎన్ని గాలివానలు రేగుతాయో ! ఎన్ని అగ్ని పర్వతాలు ప్రేలుతాయో ! ఎన్ని భూకంపాలు ఉద్భవిస్తాయో ఎవరు ఊహించుకోగలరు ?

తిమ్మరుసు : తల్లీ ! అన్నీ నేను ఊహించుకొన్నాను - ఊహించుకొన్నా నమ్మా - ఊహించుకొన్నాను. కాని అది రాజనీతి- రాజనీతికోసం నిన్నూ నీ సౌభ్యాన్నీ బలి యిచ్చాను. ఆ తీర్పు చెప్పిననాటినుండి అతడు నాకు దాసుడై పోయాడు. గజపతి ఇంటిగుట్టులన్నీ చెప్పే వాడు. నేను మాత్రం అతనిని నమ్మలేదు. నా యీ జీవితంలో నేను ఏ మనిషినీ నమ్మలేదు. నమ్మకం అంటే ప్రేమఅంటే నాకు తెలియనే తెలియదు. కాని ఇప్పు డిప్పుడు కొద్దిగా భగవంతుని మీద విశ్వాసం యేర్పడుతోంది.

మీనాక్షి : బాబుగారూ ! మిమ్మల్ని చూస్తే నాకు జాలి వేస్తోంది. ఇంక మీరు మహామంత్రి అనే విషయం మరచిపొండి. ఒక సామాన్య మానవుడుగా ఏదో ప్రొద్దుపుచ్చండి. పాపం- ఎంతటివారికి ఇట్టి గతి పట్టింది ? అబ్బా ఎంతటి మానవుల బ్రతుకులైనా ఇంతే.

తిమ్మరుసు : తల్లీ ! నీవు నన్ను మహామంత్రిగా మాత్రమే ఎరుగుదువు- కాని ఒకప్పుడు నేను ఒక సత్రంలో విస్తరాకులు కుట్టి- ఇంకొక ఊళ్ళో మధూకరం చేసుకొని- మరొకచోట తాంబూలపు తిత్తులు మోసి బ్రతికాను. తరువాత నిన్నటివరకూ ఈ విజయనగర మహాసామ్రాజ్యానికి మకుటంలేని మహారాజుగా వెలిగాను. అప్పుడు కన్నులుండీకూడా నాకు ఏమీ కనిపించలేదు. గాని- ఇప్పుడో కన్నులు లేకపోయినా- సత్యం కనిపిస్తోంది. కన్నులున్నవారు భగవంతుణ్ణి చూడలేరు తల్లీ !

మీనాక్షి : తెల్లవారింది - మీ రేదో నా కర్థం కాని మాటలు చెపుతూ ఉంటారు ఎందుకు ? నీళ్ళు తెస్తాను పళ్ళు తోముకోండి.

తిమ్మరుసు : ఏది - కొంచెం పాలు కాచు తల్లీ !

మీనాక్షి : ఆలాగే బాబుగారూ !- ఎవరో వస్తున్నారు మీ కోసం—

తిమ్మరుసు : ఎవరు వారు ?

(ధూర్జటి ప్రవేశం)

ధూర్జటి : మహామంత్రికి ధూర్జటి నమస్కారం.

తిమ్మరుసు : మహాకవీ! రండి! ఏం ఇట్లా వచ్చారు? నా కోసం రాపటం అంత మంచిది కాదేమో? మా కృష్ణరాయలు కులాసాగా ఉన్నాడా?

ధూర్జటి : రాయలు రాజయక్ష్మచే బాధపడుచున్నాడు. మరణశయ్యమీద పశ్చాత్తాపంతో కుమిలిపోతూన్నట్లు నాతో దీనంగా చెప్పుకొన్నారు.

తిమ్మరుసు : అయ్యో! పాపం! అయితే ఈ సామ్రాజ్యం ఏంకావాలి? నాగతి ఏమైనా ఈ సింహాసనంమీద సమర్థుడున్నాడుకదా అని సంతోషించాను. కృష్ణరాయలు నన్ను బంధించినా ఆశక్తి— అతనికి నేనే యిచ్చానని గర్వించాను. మీరందరు ఇప్పుడు నదుం కట్టుకొని ఈ మహాసామ్రాజ్యం విచ్ఛిత్తి కాకుండా చూడాలి.

ధూర్జటి : మహామంత్రీ! రాయలు మీ దేహాన్ని బంధించినా మనసును బంధించలేకపోయాడు. కాని నాకు ఈ ఐహికజీవితంమీదనే విరక్తి పుట్టింది. కళ్ళ యెదుట లక్ష్మీదేవి మాయాతాండవం చూచాను. కాళహస్తీశ్వరుని సాన్నిధ్యంలో తపస్సు చేసుకుంటాను.....

"దంతంబుల్ పడనప్పుడే తనువునం దారూఢి యున్నప్పుడే,
కాంతాసంఘము రోయనప్పుడె, జరాక్రాంతంబు గానప్పుడే
వింతల్ మేన జరించునప్పుడె కురుల్ వెల్వెల్ల గానప్పుడే
చింతింపన్వలె నీ పదాంబుజములన్ శ్రీ కాళహస్తీశ్వరా!"

అదిగో రాయలవారే వస్తున్నారు.

తిమ్మరుసు : ఆ! రాయలా! మా కృష్ణరాయలే! ఏడీ? ఏడీ?

శ్రీకృష్ణ భటుడు } (ప్రవేశించి) : అప్పాజీ!—అప్పాజీ!

తిమ్మరుసు : కుమారా ! కుమారా ! (ఇద్దరూ కౌగిలించుకుంటారు)

శ్రీకృష్ణ : నిన్ను క్షమాభిక్ష అర్థించటానికి మరణశయ్యమీదనుంచి లేచి వచ్చాను. క్షమించానని నీ నోటి మాట పించేనేకాని నా ప్రాణం ప్రశాంతంగా పోదు. జరిగినదేదో జరిగింది. ఈ విశాలసామ్రాజ్య నిర్మాతవు నీవే—నిన్న మొన్నటివరకు మకుటం లేని మహా పతివై నన్నుకూడా శాసించావు. తిమ్మరుసు లేకపోతే దక్షిణాపథ చరిత్రయే వేరుగా ఉండేది. అప్పాజీ నన్ను క్షమించవూ ?

తిమ్మరుసు : కుమారా ! నిన్ను ఏనాడో క్షమించాను. పుత్రుడు తప్పు చేస్తే ఏ తండ్రికీ దుఃఖం తప్పితే కోపం ఉండదుకదా ! ఊరుకో నీ పశ్చాత్తాపం నాకు మరింత దుఃఖాన్ని కలిగిస్తోంది.

శ్రీకృష్ణ : ధన్యోస్మి - అప్పాజీ ! నాకు మృత్యుభయం లేదు. కాని మనం నిర్మించిన ఈ సామ్రాజ్యం మన కండ్ల యెదుటే ముక్కచెక్కలైపోతుందేమో అన్న భయంమాత్రం వేధిస్తోంది. ఏ మహామంత్రి శేముషీధౌరంధర్యం, నరసింగరాయలతోపాటు నశించపోయే సామ్రాజ్యాన్ని నిలిపి కటకంనుంచి కన్యాకుమారి వరకు విస్తరింపచేసిందో ఆ లోకోత్తర మేధావి తిమ్మరుసు మంత్రి నేడుకూడా నా అవసానకాలంలో విచ్ఛిన్నమయ్యే విద్యా నగర సామ్రాజ్యాన్ని రక్షించాలి ! అప్పాజీ ! నీకు కళ్ళు లేవు గాని, మెదడుమాత్రం ఉన్నదిగద. ఈ అంతిమ ఘడియల్లో కూడ తుది నిర్ణయం మీకే విడిచిపెట్టుతున్నాను. ఈ విద్యానగర సామ్రాజ్యాన్ని నాకంటెకూడా మీరే ఎక్కువగా ప్రేమించారు.

తిమ్మరుసు : నేను చేసిన పాపం అది ఒక్కటే నాయనా ! విద్యానగర సామ్రాజ్యాన్ని ప్రేమించడమే....

శ్రీకృష్ణ : అప్పాజీ ! కన్నకొడుకుకు సామ్రాజ్యం కట్టబెట్టాలని చూచాను. మా అన్నగారు చేసిన నేరమే నేనూ చేసాను. నీ కన్నులు పీకించిన పిమ్మట జ్ఞానోదయం అయింది. ఇప్పుడు పద్దెనిమిది

నెలల పసికందు నా పుత్రుడు సింహాసనం ఎక్కితే రాజ్యం ముక్కచెక్కలై పోతుంది.

తిమ్మరుసు : ఈ బాధ నాకు అవగతపూర్వం। నీ పుత్రుణ్ణి నీ కూతురు నకు అల్లునికి వప్పగించు - నీ తమ్ముడు అచ్యుతదేవరాయలను దుర్గకారాగారంనుండి విడిపించి కిరీటం అర్పించు....

శ్రీకృష్ణ : కొన్ని ఘడియలలో నా ప్రాణం నిలువదు. అప్పాజీ। నీ హితోపదేశం అక్షరాలా పాటిస్తాను. ఇదిగో ఇప్పుడే ఇక్కడే అచ్యుతరాయల్ని విద్యానగరసామ్రాజ్యచక్రవర్తిగా ప్రకటి స్తున్నాను.

జైజై శ్రీ అచ్యుతదేవరాయల సార్వభౌమునికి జై।

ధూర్జటి : ఆహా। భగవల్లీల ఎంత అత్యద్భుతం - అచ్యుతదేవరాయలు, చెరసాలలో అడుగు ఎకాయెకీ సింహాసనంమీద మోపుతున్నాడు,

శ్రీకృష్ణ : అప్పాజీ। ఇదియే మన కడసారి కలయిక। (ధూర్జటి కవీంద్రా సెలవు.

[భటునితో నిష్క్రమణ]

తిమ్మరుసు : ఆ। శ్రీకృష్ణరాయలు వెళ్ళిపోయాడా।

ధూర్జటి : మరణంతోకూడ మహావీరుడుగా పోరాడుతున్నాడు. కొన్ని ఘడియలలో ప్రాణాలు పోతాయని వైద్యులు చెపుతున్నా యిట్లా వచ్చాడు.

[తెరలో శతఘ్నిరావాలు]

శ్రీశ్రీశ్రీ అచ్యుతదేవరాయసార్వభౌమా। విజయీభవ। దిగ్వి జయీభవ।

తిమ్మరుసు : అచ్యుతదేవరాయల్ని ఖైదులో పెట్టించింది నేనే - ఆతడు నా ముఖం చూడడు. ధూర్జటీ నీవు పోయి క్రొత్తరాయలకు అండగా నిలు. దక్షిణాపథం- అన్యాక్రాంతం కాకుండా చూచే బాధ్యత యిక మీదే - మీదే...

ధూర్జటి : క్షమించాలి.

"రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయంబు వారిచ్చు అం
భోజాక్షీ చతురంతయానతురగీభూషాదు లాత్మవ్యధా
బీజంబుల్ ; తదపేక్ష చాలు ; పరితృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా ;"

భటుడు : (ప్రవేశించి) కృష్ణరాయలవారి ఆజ్ఞ అయినది - తిమ్మరుసయ్య గార్ని, మీనాక్షిమ్మను విడిచిపెట్టాలని—

[నిష్క్రమణ]

తిమ్మరుసు : ఎక్కడకు వెడదాం ; మీనాక్షీ ;

మీనాక్షి : మీ యిష్టం. మీకు సేవచేస్తూ ఉంటాను.

తిమ్మరుసు : నన్ను విడిచిపెట్టవుగదా ;

మీనాక్షి : బాబుగారూ ; ఆమాట అనకండి - మీకు నేను బ్రతికి ఉన్నంత వరకూ చాకిరీ చేస్తాను.

ధూర్జటి : రండి. నాతో— కాళహస్తి పోదాం ; దేవాలయంలో.....

తిమ్మరుసు : ఎందుకు ? తిరుపతి వెడతాను. అక్కడ యిదివరలో నేను తిరుపతి వెంకన్నకు అర్పించిన ప్రసాదదానం ఉంది. నాసగం వంతు యిదివరకు శంకరమఠం విద్యార్థులకు యిమ్మన్నాను. ఇప్పుడు దానికే కక్కుర్తి పడతాను. (తెరలో హాహాకారాలు)

ధూర్జటి ; ఏదో కోలాహలం - ఆగు - విను.

(నేపథ్యంలో)

పెద్దన :

"ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూత యొసగి యెక్కించుకొనియె
గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమలయందు నిచ్చె

మనుచరిత్రం బందుకొను వేళ బురమేగ
బల్లకీ దనకేల బట్టి యెత్తె
బిరుదైన కవి గండబెండేరమున కీవె
తగుదని తానె పాదమున దొడిగె.
'ఆంధ్ర కవితాపితామహ అల్లసాని
పెద్దన కవీంద్ర' యని నన్ను బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేగలేక,
బ్రతికియున్నాడ జీవచ్ఛవంబ నగుచు."

తిమ్మరుసు : నారాయణ, నారాయణ (చెవులు మూసికొనుచు) నేనెంత మాట వినవలసి వచ్చినది! ఎవని బొమముడిపాటు గాంచినంతనే దక్షిణాపథం అంతా దద్దరిల్లి గజగజలాడిపోయిందో, ఏ మహా వీరుని కత్తి తళ తళ యుగయుగాంతరాలు చరిత్రకు మెరుగు మాయని మిరుమిట్లు కల్పించిందో—ఏ మహాకవిచక్రవర్తి రసజ్ఞత దేశభాషలకు స్వర్ణయుగం కల్పించిందో—ఏ రసజ్ఞమూర్తి కరుణాకటాక్షవీక్షణ మహాకవిఘంటాలకు బంగారుకలలు కల్పించిందో—ఆ సాహితీ సమరాంగణ సార్వభౌముడు! అయ్యో ఈ స్వర్ణయుగం ఈ క్షణంతో సమాప్తి.

ధూర్జటి :

"శ్రీ విద్యుత్ కలతాజవంజవ మహాజీమూత పాపాంబు ధా
రావేగంబున మన్మనోబ్జసముదీర్ణత్వంబు గోల్పోయితిన్
దేవా మీ కరుణా శరత్సమయమింతేజాలు చిద్భావనా
సేవం దామరతంపరై మనియెదన్ శ్రీ కాళహస్తీశ్వరా!"

(తెర)

మంగళం

(8) ಕಳಕಳಿಯ ವಿನಂತಿ

ಪ್ರಿಯ ಓದುಗರೇ, ಪತ್ರಿಕೆಯ ಸ್ಥಿರ ಮತ್ತು ನಿರಂತರ ಪ್ರಕಟಣೆಗೆ ಚಂದಾದಾರರ ಸಹಕಾರ ಅತ್ಯಗತ್ಯ. ಕಾಗದ, ಮುದ್ರಣ ಮತ್ತು ಸಾಗಣೆ ವೆಚ್ಚಗಳು ಹೆಚ್ಚಾಗಿರುವ ಈ ಸಂದರ್ಭದಲ್ಲಿ, ಚಂದಾ ಹಣವನ್ನು ಸಕಾಲದಲ್ಲಿ ಪಾವತಿಸಿ ಪತ್ರಿಕೆಯ ಜೊತೆಗಿನ ನಿಮ್ಮ ಬಾಂಧವ್ಯವನ್ನು ಮುಂದುವರಿಸಬೇಕೆಂದು ವಿನಂತಿಸಲಾಗಿದೆ.

BCI

7305

ఈ రచయిత వే

ధర్మచక్రము — రు. 2 00

చారిత్రక రూపకము

ఛత్రపతి శివాజి — .. 1 50

చారిత్రక రూపకము

కవిత్రయము — .. 2 50

తెలుగు భాషా సమితివారిచే

బహుమతినందిన గ్రంథము

విక్రమోర్వశీయము — .. 1 50

కాళిదాసు కృతికి ఆంధ్రీకృతి

తారాతోరణము — .. 1 50

ఇరువది యేడు ఖండకావ్యముల సంపుటి

ప్రతులకు:

త్రివేణి పబ్లిషర్సు

మచిలీపట్నము

మువ్వ ఫౌండేషన్ పుస్తకాల పంపిణీవాహిక

పుస్తకం సంఖ్య	RNGA115B225
పుస్తకం పేరు	శ్రీకృష్ణదేవరాయలు
తారీఖు	22 April 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	95
పెద్ద సైజు పేజీలు	20
ఖాళీ పేజీలు	10 ,BCI,CI
లేవు పేజీలు	NO
తయారు చేసినది	Anusha
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Bhargavi
పరీక్ష చేసినది	PRAGATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good